

సోమవారం ఉష్ణోగ్రతలు | గరిష్టం : 36.8° C | కనిష్టం : 22.2° C



రంజాన్ వేళలు

ఇఫ్తార్ : మంగళవారం సా : 6.31 గం..

సహర్ : బుధవారం ఉ : 5.04 గం..



ఇంక 20 రోజులే..

- మునిసిపల్ పన్నుల చెల్లింపునకు సమీపిస్తున్న గడువు
- మానుకోట పురపాలకంలో రూ.3.85 కోట్ల బకాయి
- నూరుశాతం లక్ష్యం పూర్తి చేసేందుకు సిబ్బంది కసరత్తు
- వడ్డీలో 90శాతం రాయితీపై విస్తృత ప్రచారం
- కమిషనర్ ఆధ్వర్యంలో సిబ్బంది 'స్పెషల్ డ్రైవ్'

మహబూబాబాద్ టౌన్, మార్చి 11 : మునిసిపాలిటీల్లో ఆస్తి పన్నుల చెల్లింపునకు గడువు సమీపిస్తోంది. ఇంటి, నల్లా, షాపుల ట్రేడ్ లైసెన్స్‌ల పన్నుల వసూళ్లకు మరో 20రోజులు మాత్రమే సమయం ఉంది. ఈ ఆర్థిక సంవత్సరం మార్చి 31 తేదీ వరకు వందశాతం పన్నుల వసూలు పూర్తి కావాల్సి ఉంటుంది. వచ్చేనెల ఒకటో తేదీ నుంచి నూతన ఆర్థిక సంవత్సరం ఆరంభమవుతుంది. ఈ నెలాఖరు వరకు పన్నులు చెల్లించని వారికి ఆస్తిపన్నుకు జరిమానాలు విధిస్తారు. అందుకోసం ఆర్థిక సంవత్సరం ముగింపు ఈనెల 31 వరకు ఇంటి, నల్లా, షాపుల ట్రేడ్ లైసెన్స్‌ల పన్నులనే చెల్లించాల్సి ఉంటుంది. మహబూబాబాద్ మునిసిపాలిటీ పరిధిలో పాత బకాయిలు, ఈ ఆర్థిక సంవత్సరం పన్నులు మొత్తంగా రూ.3.85 కోట్ల మేర వసూలు చేయాల్సి ఉంది. అందులో ఇంటిపన్ను రూ.1.90 కోట్లు ఉండగా, నల్లాపన్ను రూ. 1.95 కోట్ల మేర ఉన్నాయి. ఇక షాపులకు సంబంధించి ట్రేడ్ లైసెన్స్‌లు రూ. 5.41 లక్షల వరకు వసూలు చేయాల్సి ఉంది. మునిసిపల్ సిబ్బంది ఏ సంవత్సరానికి ఆ సంవత్సరం పన్నుల వసూళ్లను వేగవంతం చేసినప్పటికి పూర్తి స్థాయిలో వందశాతం వసూళ్లు కాక బకాయిలు పడుతూనే ఉన్నాయి. దీంతో ప్రతి ఏటా బకాయిలతో పాటు ఆ ఏడాది పన్నులను వసూలు చేయాల్సి వస్తోంది. ఈనెల 31వ తేదీలోగా వందశాతం పన్నులు వసూలు చేయాల్సిన బాధ్యత అధికారులపై ఉంది.

36 వార్డులతో..

ఉమ్మడి వరంగల్ జిల్లాలో 36 వార్డులతో అతిపెద్ద మానుకోట మునిసిపాలిటీలో పన్నుల బకాయి రూ.3.85 కోట్లు ఉంది. గత బకాయితో పాటు ఈ ఆర్థిక సంవత్సరంతో కలిపి రూ.3.85 కోట్లు వసూలు చేయాల్సి ఉంది. ఇందులో మునిసిపల్ పరిధిలోని 22,002 గృహాలకు సంబంధించి ఈ ఏడాది రూ. 3.99 కోట్లు, గతంలో పెండింగ్ ఉన్న బకాయి.. మొత్తం రూ.1.16 మొత్తంగా రూ. 5.15 కోట్లు ఉండగా, ఇప్పటి వరకు రూ.3.25 కోట్లు వసూలు చేశారు. ఇంకా రూ.1.90 కోట్లు వసూలు చేయాల్సి ఉంది. ఇక పట్టణ పరిధిలోని 12,251 నల్లా కనెక్షన్లు ఉండగా, వాటికి సంబంధించి నల్లాపన్ను ప్రస్తుత సంవత్సరం రూ. 1.24 కోట్లు, పాతబకాయి రూ.1.15 కోట్లు వెరసీ రూ. 2.39 కోట్లు ఉన్నాయి. అందులో కేవలం రూ.44 లక్షలు మాత్రమే వసూలు చేయగా ఇంకా రూ.1.95 కోట్లు నల్లా పన్నులు వసూలు చేయాల్సి ఉంది. మరోవక్క ట్రేడ్ లైసెన్స్ 1,447 షాపులకు గాను పాతవి, కొత్తవి కలిపి మొత్తంగా రూ. 19.82 లక్షలు ఉండగా ఇప్పటి వరకు రూ. 14.41 లక్షలు వసూలు చేయగా ఇంకా రూ.5.41 లక్షలు వసూలు చేయాల్సి ఉంది. కాగా, ఇంటి పన్నులు 62.94 శాతం, నల్లా పన్నులు 18.15 శాతం, ట్రేడ్ లైసెన్స్‌లు 72.70 శాతం పన్నులు వసూలు చేశారు.

స్పెషల్ డ్రైవ్..

మహబూబాబాద్ మునిసిపల్ పరిధిలో పన్నుల వసూలుకు కమిషనర్ నోముల రవీందర్ నేతృత్వంలో స్పెషల్ డ్రైవ్ చేపట్టారు. అధికారుల సలహాలు, సూచనలతో మునిసిపల్ సిబ్బంది ప్రత్యేక కార్యాచరణతో ముందుకు సాగు తూ వందశాతం పన్నుల వసూలుకు కృషి చేస్తున్నారు. మరోపక్క పన్నులు చెల్లించి పట్టణాభివృద్ధికి సహకరిం చాలని, రాష్ట్రప్రభుత్వం 2022-23 ఆర్థిక సంవత్సర ఆస్తి పన్నుల పెనాల్టీలపై ఇచ్చిన 90 శాతం మినహాయింపుపై విస్తృత ప్రచారం చేస్తున్నారు. పట్టణంలోని ప్రధాన కూడళ్లలో ఫ్లెక్సీలను ఏర్పాటు చేసి ప్రజలకు అవగాహన కల్పిస్తున్నారు. అంతే కాకుండా మునిసిపల్ వాహనాలతో వాయిస్ రికార్డుతో మైకుల ద్వారా ప్రచారం చేస్తున్నారు. ఆర్థిక సంవత్సరం ముగింపు మార్చి 31 వరకు వందశాతం పన్నులు వసూలు చేయాలనే లక్ష్యంతో ముందుకు సాగుతున్నారు. ఏది ఏమైనప్పటికి మరో 20 రోజుల్లో మిగిలిన పన్నులు వసూలు చేసి, వందశాతం లక్ష్యాన్ని చేరుకుంటారో లేదో వేచి చూడాలి.




పన్నులు కట్టాలని ప్రచారం చేస్తూ ఏర్పాటు చేసిన ఫ్లెక్సీ

తొర్రూరు, డోర్నకల్, మరిపెడలో..

జిల్లాలోని ఆ మూడు మునిసిపాలిటీల్లో పన్నుల వసూలు ప్రక్రియ కొనసాగుతోంది. తొర్రూరు మునిసిపల్ పరిధిలో రూ.2.31 కోట్ల మేర పన్నులు వసూలు చేయాల్సి ఉండగా ఇప్పటి వరకు రూ. 1.23 కోట్లు వసూలు చేయగా ఇంకా రూ.1.08 కోట్లు వసూలు చేయాల్సి ఉంది. డోర్నకల్ మునిసిపాలిటీలో రూ.1.04 కోట్లు రావల్సి ఉండగా, అందులో రూ.73 లక్షలు వసూలు చేయగా, ఇంకా రూ.31 లక్షలు బకాయి ఉంది. ఇక్కడ 70 శాతం మేర పన్నులు వసూలు చేశారు. మరిపెడలో రూ.1.56 కోట్లకు గాను రూ.82.56 లక్షలు వసూలు చేయగా రూ.73.91 లక్షలు వసూలు చేయాల్సి ఉంది. ఇక్కడ 63 శాతం మేర పన్నులు వసూలు అయ్యాయి.

పన్నులు చెల్లించి అభివృద్ధికి సహకరించాలి

- నోముల రవీందర్, మునిసిపల్ కమిషనర్, మానుకోట



ఇంటి, నల్లా పన్నులు సకాలంలో చెల్లించి మానుకోట మునిసిపల్ అభివృద్ధికి సహకరించాలి. ఆర్థిక సంవత్సరం ముగింపు ఈనెల 31తో పూర్తి కావడంతో.. పన్నులు చెల్లించి మునిసిపాలిటీ అభివృద్ధిలో భాగస్వాములు కావాలి. రాష్ట్రప్రభుత్వం గత ఆర్థిక సంవత్సరం ఆస్తిపన్నుల బకాయిల పెనాల్టీలపై 90 శాతం ఇచ్చిన మినహాయింపును సద్వినియోగం చేసుకోవాలి. ప్రతీ ఒక్కరు పన్నులు చెల్లించి సహకరించాలి.



రంజాన్ మాసం ఆరంభం సందర్భంగా విద్యుత్ దీపాల అలంకరణలో మహబూబాబాద్‌లోని ఓ మస్జిద్

నెలవంక దర్శనంతో..

- ఆరంభమైన రంజాన్ ఉపవాస దీక్షలు
- ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా మస్జిద్‌లతో తరహావీలు షురూ
- విద్యుత్ దీపాలంకరణతో కళకళలాడుతున్న మస్జిద్‌లు

మహబూబాబాద్, మార్చి11 (ఆంధ్రజ్యోతి) : యావత్ ముస్లింలు అత్యంత భక్తిశ్రద్ధలతో, నియమనిష్టలతో ఆచరించే పవిత్ర రంజాన్ మాస ఉపవాస దీక్షలు ప్రారంభమయ్యాయి. సోమవారం సాయంత్రం నెలవంక కనిపించిందన్న హైదరాబాద్ హిలాల్ కమిటీ ప్రకటనతో రాత్రి రంజాన్ ప్రత్యేక తరహావీ నమాజ్‌లు నిర్వహించుకుని మంగళవారం తెల్లవారుజాము నుంచి తొలి రంజాన్ ఉపవాస దీక్షలను ప్రారంభించారు. ఇక రంజాన్ ఉపవాస దీక్షల ప్రకటనకు సంకేతంగా ముందస్తుగానే అన్ని మస్జీద్‌లలో సైరన్‌లు మోగించడంతో రంజాన్ సందడి నెలకొంది. రంగురంగుల విద్యుత్ దీపాల అలంకరణతో మస్జీద్‌లు రంజాన్ శోభను సంతరించుకున్నాయి. ఈ క్రమంలోనే ఆయా మస్జీద్‌ల వద్ద ఉపవాస దీక్షల విరమణ సందర్భంగా తీసుకునే రకరకాల ఖర్జూరం పండ్లతోపాటు వివిధ రకాల డ్రైఫ్రూట్స్, చికెన్ హరీస్, మటన్ హలీమ్, బిర్యానీ వంటకాల హోటళ్లు వెలిశాయి. మత సామరస్యానికి, భక్తి భావానికి ప్రఖ్యాతి గాంచిన విశిష్టమైన శుభప్రదమైన రంజాన్ మాసానికి స్వాగతం పలకడానికి షాబాన్ మాసం నుంచే అన్నివిధాల ముస్లింలు సిద్ధమవగా.. చంద్రదర్శనాన్ని బట్టి 29 లేదంటే 30 రోజుల పాటు ఉపవాస దీక్షలు కొనసాగనున్నాయి.



డోర్నకల్ రైల్వే స్టేషన్‌లో ఇంటర్ సిటీ ఎక్స్‌ప్రెస్‌ను పరిశీలిస్తున్న సిబ్బంది

సాంకేతిక లోపంతో నిలిచిన ఇంటర్ సిటీ

డోర్నకల్, మార్చి 11 : సికింద్రాబాద్-గుంటూరు మధ్య నడిచే ఇంటర్ సిటీ ఎక్స్‌ప్రెస్ (12706) సాంకేతిక లోపంతో సోమవారం డోర్నకల్ రైల్వేస్టేషన్‌లో 20 నిమిషాల పాటు నిలిచిపోయింది. గుండ్రాతిమడుగు-గార్ల స్టేషన్ మధ్య ఇంజన్ తర్వాత ఉన్న పవర్‌కార్ బోగీలో వాటర్ ట్యాంక్ కింద వైపు రంధ్రం పడి నీరు లీకవుతుండడం గమనించిన సిబ్బంది వెంటనే రైలు లోకోపైలెట్‌కు సమాచారమిచ్చారు. తొలు త గార్ల స్టేషన్ సమీపంలో రైలును పదినిమిషాల పాటు నిలిపి వేసి మరమ్మతులు చేపట్టారు. అక్కడ మరమ్మతులకు వీలు కాకపోవడంతో డోర్నకల్ సీఅండ్‌డబ్ల్యూ సిబ్బందికి స మాచారం అందించారు. అక్కడ్నుంచి బయలుదేరిన ఇంటర్‌సిటీ ఎక్స్‌ప్రెస్‌ను డోర్నకల్ రైల్వేస్టేషన్‌లో 20 నిమిషాల పా టు మరమ్మతుల అనంతరం రైలును పంపించారు.



మాట్లాడుతున్న అశోక్‌కుమార్

'చిన్నతరహా పరిశ్రమల స్థాపనతో ఎదగాలి'

మహబూబాబాద్ టౌన్, మార్చి 11 : చిన్నతరహా పరిశ్రమలు ఏర్పాటు చేసి చిరు వ్యాపారాల ద్వారా ఆర్థికంగా ఎదగాలని ఖాదీ, గ్రామీణ పరిశ్రమల మండలి వరంగల్ రీజియన్ అధికారి సీహెచ్. అశోక్‌కుమార్, చైల్డ్ వెల్ఫేర్ కమిటీ (సీడబ్ల్యూసీ) జిల్లా చైర్‌పర్సన్ డాక్టర్ నాగవాణి అన్నారు. మహబూబాబాద్ పట్టణంలోని గంగపుత్రభవనంలో సోమవారం ఖాదీ, గ్రామీణ పరిశ్రమల మండలి ఆధ్వర్యంలో ప్రధానమంత్రి ఉపాధి కల్పన పథకం (పీఎంఈజీపీ) అవగాహన సదస్సును నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పీఎంఈజీపీ పథకం ద్వారా బ్యాంక్ రుణాలు పొంది పరిశ్రమలను స్థాపించుకుని ఆర్థికంగా ఎదగాలని సూచించారు. మహిళలు ఈ సదవకాశాన్ని సద్వినియోగం చేసుకుని కుటుంబానికి బాసటగా నిలవాలన్నారు. ఈ కార్యక్రమంలో పట్టణపేదరికనిర్మూలన సంస్థ (మెప్మా) డీఎంసీ విజయ, అధికారులు సత్యనారాయణ, శర్మ, బానోత్ లోకేష్, శోభన్, భవానీ, పరమాత్మాచారి పాల్గొన్నారు.

తాగునీటి సమస్య తలెత్తకుండా ప్రణాళిక

- ఉద్యోగులు విధుల పట్ల అలసత్వం చేయొద్దు
- మునిసిపల్ చైర్మన్ పాల్వాయి రామోహన్‌రెడ్డి



మాట్లాడుతున్న పాల్వాయి రామోహన్‌రెడ్డి

మహబూబాబాద్ టౌన్, మార్చి 11 : వేసవిలో తాగునీటి సమస్య తలెత్తకుండా ప్రత్యామ్నాయ ఏర్పాట్లతో ముందస్తు ప్రణాళికలను సిద్ధం చేస్తున్నట్లు మునిసిపల్ చైర్మన్ పాల్వాయి రామోహన్‌రెడ్డి అన్నారు. మహబూబాబాద్ మునిసిపల్ కార్యాలయంలో తాగునీటి సమస్య తలెత్తకుండా తీసుకోవాల్సిన చర్యలపై సోమవారం పాలకమండలి ప్రత్యేక సమావేశాన్ని నిర్వహించారు. తాగునీటి సమస్య రాకుండా ప్రత్యామ్నాయ ఏర్పాట్లపై చర్చించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మానుకోట పట్టణంలో నీటిఎద్దడి లేకుండా ప్రణాళికలు తయారు చేసి, వాటిని ఎమ్మెల్యే దృష్టికి తీసుకువెళ్లి సమస్య పరిష్కారానికి కృషి చేస్తామని వివరించారు. ఉద్యోగులు విధులపట్ల అలసత్వం ప్రదర్శించవద్దని వేసవి రెండు మాసాలు అప్రమత్తంగా ఉండి పని చేయాలని సూచించారు. మున్నేరు వాగును వినియోగంలోకి తీసుకునేందుకు చర్యలు చేపడుతున్నామని, అవసరమైతే బావులను అందుబాటులోకి తీసుకువచ్చి నీరందిస్తామన్నారు.

కౌన్సిల్‌లో చర్చ జరిగిందిలా..

మహబూబాబాద్ మునిసిపల్ కార్యాలయంలో తాగునీటి ఎద్దడి నివారణపై ప్రత్యేకంగా నిర్వహించిన సమావేశంలో కౌన్సిలర్లు తమ అభిప్రాయాలను వెల్లడించారు. తొలుత సీపీఎం ఫ్లోర్‌లీడర్ సూర్నపు సోమయ్య మాట్లాడారు. పాలేరు గ్రిడ్‌లో ఎన్నినీళ్లు ఉన్నాయి..? ఎన్ని రోజులు వస్తాయో తెలపాలని కోరారు. మిషన్ భగీరథ నీటి సరఫరాలో సైతం కోత పెట్టారని తెలుస్తోందని, మిషన్ భగీరథపై ఆశతో పాత పద్ధతిని మూలకు పడవేశారని, తక్షణమే తాగునీటి సమస్య పరిష్కారానికి ప్రత్యేక ప్రణాళికలు తయారు చేసి పనులను వేగవంతం చేయాలని సూచించారు. బీఆర్ఎస్ కౌన్సిలర్ ఎడ్ల వేణు మాట్లాడుతూ ఎన్నడు లేని విధంగా ఈ సంవత్సరం మార్చిలోనే నీటి సమస్య వస్తోందని, మున్నేరువాగు, ఫిల్టర్‌బెడ్‌ను వినియోగంలోకి తీసుకువచ్చి సమస్యను పరిష్కరించాలన్నారు.

కాంగ్రెస్ ఫ్లోర్‌లీడర్ వెన్నం లక్ష్మారెడ్డి మాట్లాడుతూ పాతబజారుకు మున్నేరువాగు ద్వారా, కొత్త బజారుకు మిషన్ భగీరథ ద్వారా నీటి సరఫరా చేయాలని, అలా సరిపోని ఫంలో ట్యాంకర్ల ద్వారా సరఫరా చేయాలని సూచించారు. సీపీఐ ఫ్లోర్ లీడర్ అజయ్‌సారథి రెడ్డి మాట్లాడుతూ మున్నేరు వాగును, ఫిల్టర్‌బెడ్‌ను నిర్లక్ష్యం చేయడంతో ఈరోజు నీటితిప్పలు వస్తున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. మిషన్‌భగీరథ ఏఈ హరీష్ మాట్లాడుతూ మహబూబాబాద్ పట్టణానికి మిషన్ భగీరథ ద్వారా 12.65 ఎంఎల్‌డీ నీరును అందించాలని, ప్రస్తుతం 10 ఎంఎల్‌డీ నీటిని అందిస్తున్నామని, పాలేరులో నీటి కొరత వల్ల ఇంకా 20 రోజులు మాత్రమే పట్టణానికి నీటి సరఫరా అయ్యే అవకాశం ఉందని, ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయాలని సూచించారు. వేసవిలో తాగునీటి సమస్య నివారణకు ప్రత్యేక ప్రణాళికలు రచించి ఎమ్మెల్యే దృష్టికి తీసుకు వెళ్లి నిధులు తీసుకువచ్చి ప్రత్యామ్నాయ మార్గాల ద్వారా నీటి సమస్య రాకుండా చూడాలని కౌన్సిల్‌లో తీర్మానించారు.

ఈ సమావేశంలో కమిషనర్ నోముల రవీందర్, డీఈ ఉపేందర్, కౌన్సిలర్లు హరిసింగ్, భూక్య శ్రీను, పోతురాజు రాజు, దండెబోయిన బుజ్జి వెంకన్న, తాళ్లపల్లి జగన్, నీరజ మార్నేని శ్రీదేవి, అనురాధ, ఇందిర పాల్గొన్నారు.

పార్లమెంట్ ఎన్నికల్లో ప్రశ్నించే గొంతుకను గెలిపించండి

- ఎలక్షన్స్ సమయంలో ఓట్లకు వచ్చే వారిని తిరస్కరించండి
- మానుకోట ఎంపీ మాలోతు కవిత

మహబూబాబాద్ టౌన్, మార్చి11 : వచ్చే పార్లమెంట్ ఎన్నికల్లో ప్రశ్నించే గొంతుక బీఆర్ఎస్ అభ్యర్థిని పార్లమెంట్‌కు పంపించాలని మానుకోట ఎంపీ, బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి మాలోతు కవిత పిలుపునిచ్చారు. భారత రాష్ట్ర సమితి అభ్యర్థులను గెలిపిస్తే కాంగ్రెస్ ఎన్నికల హామీలపై నిలదీసి, అమలు చేసే విధంగా ప్రశ్నిస్తారని, కేంద్రంపై ఒత్తిడి తీసుకువచ్చి తెలంగాణ అభివృద్ధి కోసం నిలబడుతారని చెప్పారు. మహబూబాబాద్ జిల్లా కేంద్రంలోని ఎంపీ క్యాంపు కార్యాలయంలో మానుకోట అసెంబ్లీ నియోజకవర్గ బీఆర్ఎస్ ముఖ్యకార్యకర్తల సమావేశాన్ని సోమవారం నిర్వహించారు.

ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఎన్నికల సమయంలో ఓట్ల కోసం వచ్చే వారిని ప్రజలు తిరస్కరించాలని పిలుపునిచ్చారు. ఎమ్మెల్యేగా గెలవలేరని కాంగ్రెస్ పార్టీ పోరిక బలరాంనాయక్‌కు టిక్కెట్ ఇవ్వలేదని, ఎమ్మెల్యేగా చెల్లని నాణేం ఇప్పుడు ఎంపీగా ఎలా చెల్లుతుందని ప్రశ్నించారు.



మహబూబాబాద్ సమావేశంలో మాట్లాడుతున్న మాలోతు కవిత

కాంగ్రెస్ వైఫల్యాలను ప్రజల్లోకి తీసుకువెళ్లాలి : సత్యవతి రాథోడ్

రాష్ట్రంలో ఎన్నికల సమయంలో కాంగ్రెస్ ఇచ్చిన హామీల అమలు వైఫల్యాలను ప్రజల్లోకి తీసుకువెళ్లాలని మాజీమంత్రి, ఎమ్మెల్సీ సత్యవతిరాథోడ్ అన్నారు. ఎన్నికల సమయంలో అడ్డగోలు వాగ్దానాలతోప్రజలను మోసం చేసి కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిందని విమర్శించారు. సొంత ప్రయోజనాల కోసం పార్టీలు మారే వ్యక్తులకు తగిన బుద్ధి చెప్పాలన్నారు. గతంలో కేంద్ర మంత్రిగా పనిచేసిన బలరాంనాయక్ ప్రజలకు ఏమి చేశారని పార్లమెంట్ ఎన్నికల్లో ఆయనకు ఎందుకు ఓట్లు వేయాలని ప్రశ్నించారు. తెలంగాణ ప్రజల గొంతుక బీఆర్ఎస్‌ను గెలిపించాలని పిలుపునిచ్చారు.

ఎంపీ ఎన్నికల్లో ద్రోహం చేయకండి : శంకర్‌నాయక్

తనకు ద్రోహం చేసినట్లుగా ఎంపీ ఎన్నికల్లో ద్రోహం చేయకండని, కన్న తల్లిలాంటి పార్టీని మోసం చేయవద్దని మాజీ ఎమ్మెల్యే బానోత్ శంకర్ నాయక్ కోరారు. తన నియోజకవర్గంలో జోక్యం చేసుకోవద్దని, దయచేసి గ్రూపులు పెట్టవద్దని హితవు పలికారు.

సమావేశంలో జడ్పీ చైర్‌పర్సన్ ఆంగోతు బిందు, మునిసిపల్ చైర్మన్ పాల్వాయి రామోహన్‌రెడ్డి, మర్రి రంగారావు, పర్కాల శ్రీనివాస్‌రెడ్డి, బీరవెల్లి భరత్ కుమార్‌రెడ్డి, కేఎస్ఎన్.రెడ్డి, వద్దిరాజు కిషన్, బానోత్ రవికుమార్, ఎమ్డీ.ఫరీద్, షేక్, మహబూబ్‌పాషా, లూనావత్ ప్రియాంక, ఎల్డి మల్లయ్య, ముత్యం వెంకన్న, పరిపాటి వెంకటరెడ్డి, యాకూబ్‌రెడ్డి, గద్దె రవి, వెంకటకృష్ణారెడ్డి, తేళ్ల శ్రీనివాస్, అశోక్‌నాయక్, నజీర్ అహ్మద్, నవీన్‌రావు, మందుల రఘు తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న అద్వైత్‌కుమార్‌సింగ్

ఎంసీసీని పక్కాగా అమలు చేయాలి

- కలెక్టర్ అద్వైత్‌కుమార్‌సింగ్

మహబూబాబాద్, మార్చి 11 (ఆంధ్రజ్యోతి) : పార్లమెంట్ ఎన్నికల్లో మోడల్‌కోడ్ ఆఫ్ కండక్ట్ (ఎంసీసీ)ని పకడ్బందీగా అమలు చేయాలని కలెక్టర్ అద్వైత్‌కుమార్‌సింగ్ సూచించారు. కలెక్టర్ కార్యాలయంలో సోమవారం వచ్చే పార్లమెంట్ ఎన్నికల్లో జిల్లాలో తీసుకోవాల్సిన చర్యలపై అధికారులతో సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మోడల్ కోడ్‌ఆఫ్‌కండక్ట్, ఆదాయ వ్యయవివరాలు, ఫ్లయింగ్‌స్క్వాడ్స్, మీడియా మానిటరింగ్, సర్టిఫికేషన్ కమిటీ తదితర విభాగాలు భారత ఎన్నికల సంఘం సూచించిన ఆదేశాల మేరకు పక్కాగా మోడల్‌కోడ్ ఆఫ్ కండక్ట్‌ను అమలు చేయాలని అధికారులను ఆదేశించారు. క్షేత్ర స్థాయిలో ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసి సీసీ కెమెరాలు, డొమెస్టిక్, వైలెన్స్ వివిధ రాజకీయ పార్టీల ప్రకటనల ముందస్తు అనుమతులు, బహి రంగ సభలు, సమావేశాలు, ఎన్నికలకు సంబంధించిన అంశాలపై ఆలస్యం చేయకుండా స్పష్టమైన సమాచారంతో నివేదికలు రోజువారీగా సమర్పించాలని చెప్పారు. రోజువారి ఖర్చుల నివేదిక వివరాలు అధికారులు పక్కాగా రికార్డులు నిర్వహించి, నివేదికను సమర్పించాలని సూచించారు. ఈ సమీక్షా సమావేశంలో అదనపు కలెక్టర్లు లెనిన్‌వత్సల్‌టొప్పో, ఎం.డేవిడ్, జిల్లా అధికారులు నర్మద, సురేష్ పాల్గొన్నారు.

అంతర్జాతీయ మహిళా దినోత్సవానికి జిల్లా నుంచి వెయ్యి మంది..

సికింద్రాబాద్ పరేడ్ గ్రౌండ్స్‌లో మంగళవారం నిర్వహించబోయే అంతర్జాతీయ మహిళ దినో త్సవ వేడుకలకు జిల్లా నుంచి స్వయం సహాయక బృందాల్లోని 1000 మంది మహిళలు పాల్గొంటున్నట్లు కలెక్టర్ అద్వైత్‌కుమార్ సింగ్ తెలిపారు. కలెక్టర్ కార్యాలయంలో సోమవారం తహసీల్దార్‌లు, మునిసిపల్ కమిషనర్లు, మండల ప్రత్యేక అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 12న ఉదయం 4.30 గంటలకు బస్సులు జిల్లా, మండలకేంద్రాల నుంచి బయలుదేరుతాయని, మండలా ల్లో ప్రత్యేక అధికారులు, మునిసిపాలిటీలో కమిషనర్లు అందుకు అవసరమైన ఏర్పాట్లు చేయాలని సూచించారు. సమావేశంలో అదనపు కలెక్టర్లు ఎం.డేవిడ్, లెనిన్‌వత్సల్‌టొప్పో పాల్గొన్నారు.

ఆరుగురు ఎంపీటీసీలు బీఆర్ఎస్‌కు రాజీనామా

- పెద్దవంగర మండలంలో 'గులాబీ' పార్టీకి షాక్

పెద్దవంగర, మార్చి 11 : రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారం చేపట్టిన నాటి నుంచి ప్రతిపక్షంలో ఉన్న బీఆర్ఎస్‌కు రోజురోజుకు షాక్‌లు తప్పడం లేదు. ఇటీవల పెద్దవంగర ఎంపీపీ ఈదురు రాజేశ్వరిపై అవిశ్వాస తీర్మానం చేస్తూ ఆర్డీవో కార్యాలయంలో ఎంపీటీసీలు అవిశ్వాస తీర్మాన పత్రాన్ని అందజేసిన విషయం విదితమే. వైస్ఎంపీపీ బొమ్మరబోయిన కల్పన, ఎంపీటీసీలు బానోతు రవీందర్, ఎర్ర సబిత, బానోతు విజయ, ఈరెంటి అనురాధ, మెట్టు సౌజన్య (ఆరుగురు) ఎంపీటీసీలు మూకుమ్మడిగా బీఆర్ఎస్ పార్టీ సభ్యత్వానికి రాజీనామా చేస్తున్నట్లు సోమవారం ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా పలువురు ఎంపీటీసీలు మాట్లాడుతూ ఎంపీపీ విధులు నిర్వహించకుండా ఆమె భర్త సొంత నిర్ణయాల కారణంతోనే బీఆర్ఎస్ పార్టీకి రాజీనామా చేసినట్లు చెప్పారు. తదపరి కార్యాచరణ త్వరలో ప్రకటిస్తామని తెలిపారు.



బీఆర్ఎస్‌కు రాజీనామా చేస్తున్నట్లు ప్రకటిస్తున్న ఎంపీటీసీలు



కురవి పెద్దచెరువులో భద్రకాళి సమేత వీరభద్రస్వామికి తెప్పోత్సవ దృశ్యం

కన్నుల పండువగా..

- కల్యాణ వీరభద్రస్వామి తెప్పోత్సవం

కురవి, మార్చి11 : కురవి శ్రీవీరభద్రస్వామి, భద్రకాళి మాత కల్యాణ మహోత్సవాల్లో భాగంగా 5వ రోజు సోమవారం రాత్రి తెప్పోత్సవ పూజా కార్యక్రమం కన్నులపండువగా సాగింది. దేవతా శివ సత్తుల అలంకరణలో కళాకారుల తాండవం, వీరముష్టి కళాకారుల నృత్యాల నడుమ వీరభద్ర స్వామి, భద్రకాళిమాతల విగ్రహాలను ఊరేగింపుగా కురవి పెద్దచెరువు వద్దకు తీసుకు వచ్చారు. అనంతరం చెరువువద్ద గణపతిపూజ, పుణ్యాహవాచనం, నవగ్రహపూజ, వాస్తుపూజ, వాస్తు హోమం, బలిహరణ, జిష్టికుంబం, దేవతాపూ జాచారాలతో పూజా కార్యక్రమాలను నిర్వహించారు. తర్వాత భద్రకాళి సమేత వీరభద్రస్వామిని ప్రత్యేకంగా అలం కరించిన పడవలో కూర్చోబెట్టి తెప్పోత్సవం నిర్వహించారు. భద్రకాళి సమేత వీరభద్రడు సుమారు గంటసేపు తటాకంలో విహరించి, భక్తులకు కనువిందు చేశారు. ఆలయ అధికారులు వివిధ ఆకారాల్లో ఏర్పాటుచేసిన బాణా సంచా పేలుళ్లు ఆకట్టుకున్నాయి.

ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా దేవాదాయ శాఖ కమిషనర్ అనిల్‌కుమార్ హాజరయ్యారు. మహబుబాబాద్ డీఎస్పీ తిరుపతిరావు ఆధ్వర్యంలో రూరల్ సీఐ శరవయ్య, ఎస్సై గోపి బందోబస్తు పర్యవేక్షించారు. ప్రభుత్వవిప్, డోర్నకల్ ఎమ్మెల్యే జాటోతు రామచంద్రునాయక్ ఆలయ ఈవో సత్యనారాయణ, చైర్మన్ కొర్ను రవీందర్‌రెడ్డి, ధర్మకర్తలు బాలగాని శ్రీను, చిన్నం గణేష్, అవిరె మోహన్‌రావు, ఎస్.రాజేందర్‌కుమార్ పాల్గొన్నారు.



పూజా కార్యక్రమాన్ని నిర్వహిస్తున్న అర్చకులు

BHIMAA SHIVA THANDAVAM నేడే చూడండి



సుదర్శన్ 35 ఎంఎం - ఎ/సి ఆర్.టి.సి. క్రాస్ రోడ్స్
Enjoy 4k Laser Projection & Dolby Atmos Sound
11.00,2.15,6.00,9.15

GLOBAL CINEMAS LLP

ఈనెల 15న బ్రహ్మాండమైన విడుదల



మహాలక్ష్మి కాంప్లెక్స్ - కొత్తపేట | తాళ్కూరి 70 - ఇసిఐఎల్

ఈనెల 15న బ్రహ్మాండమైన విడుదల



లక్ష్మీకళ సినీప్లెక్స్ ఎ/సి - మూసాపేట్

NAVODAYA PICTURES 9505093322, 9848028739

గువ్వలేని పాటల గూడు

నేడు రచయిత కందికొండ యాదగిరి వర్ధంతి



హనుమకొండ, మార్చి 11 (ఆంధ్రజ్యోతి): ప్రముఖ సినీ గీత రచయిత, కవి, కథకుడు కందికొండ యాదగిరి తెలుగు సినీ ప్రపంచానికి దూరమై అప్పుడే రెండేళ్లవుతోంది. ఆయన మృతితో గువ్వలేని పాట గూడు చిన్నబోయింది. పాటల ప్రపంచం మూగవోయింది. కథలు, కవిత్వాలతో తేజరిల్లిన సాహితీ లోకం నిస్తేజంగా మారింది. 20 ఏళ్ల సినీ ప్రస్థానంలో 1300లకుపైగా పాటలు రాసిన కందికొండ లేని లోటు ఇప్పటికీ పూడ్చలేదు. పుట్టిపెరిగిన నాగుర్లపల్లి.. యాదగిరి నిష్క్రమణ విషాదం నుంచి ఇంకా తేరుకోలేదు, మిత్రుల గుండెల్లో ఆయన జ్ఞాపకాలు ఇప్పటికీ పచ్చిగానే ఉన్నాయి. ఈనెల 12న కందికొండ యాదగిరి వర్ధంతి. ఈ సందర్భంగా ఆయన యాదిలో..

నాగర్లపల్లి వాసి..

కందికొండ స్వస్థలం వరంగల్ జిల్లా నర్సంపేట మండలంలోని నాగుర్లపల్లి గ్రామం. ప్రాథమిక విద్య సొంతూరులోనే పూర్తి చేశాడు. డిగ్రీ వరకు మహబూబాబాద్‌లో చదుకున్నాడు. ఉస్మానియా విశ్వవిద్యాలయం నుంచి తెలుగు సాహిత్యంలో ఎంఏ, పొలిటికల్ సైన్స్‌లో ఎంఏ చేశారు. కందికొండ తాను చదువుకునే రోజుల నుంచే పాటు రాయడం ప్రారంభించారు. తాను రాసిన పాటలు, కవితను తోటి విద్యార్థులతో పంచుకునేవారు. విద్యార్థి దశలో పాటతోటలో విహరించడం మొదలుపెట్టారు. అలా పాటే ఆయన ప్రాణమైంది. తర్వాత పాటతోనే జీవన ప్రయాణం సాగింది. అలా పల్లెలో పల్లవించిన కందికొండ పాట పరిమళం మెల్లిగా ఎల్లెడలా వ్యాపించింది.

క్యాన్సర్‌తో పోరాడి..

క్యాన్సర్ మహమ్మారి 49 ఏళ్ల వయసులోనే కందికొండను కబళించింది. 2022 మార్చి 12న హైదరాబాద్‌లోని తన నివాసంలో మరణించాడు. 2012లో ఆయనకు తొలిసారిగా క్యాన్సర్ నిర్ధారణ అయింది. అప్పట్లోనే సర్జరీ చేయించుకున్నారు. క్యాన్సర్‌ను జయించానుకున్నాడు. కానీ 2019లో అది మళ్లీ తిరగబెట్టడంతో చికిత్సలో భాగంగా చేసిన కీమోథెరపీ, రేడియేషన్ ప్రభావం వల్ల వెన్నెముక దెబ్బతిన్నది. అప్పటి నుంచి కందికొండ పూర్తిగా మంచానికే పరిమితమయ్యారు. కందికొండకు భార్య రమాదేవి, కుమార్తె మాతృక, కుమారుడు ప్రభంజన్ ఉన్నారు.

ఈనెల 15న బ్రహ్మాండమైన విడుదల



సంధ్య 70 ఎంఎం - ఆర్.టి.సి. క్రాస్ రోడ్స్
Enjoy 4k Laser Projection & Dolby Atmos Sound
రాజధాని 70ఎంఎం - దిల్‌సుఖ్‌నగర్ | అర్జున్ 70 ఎంఎం ఎ/సి - కూకట్‌పల్లి
ఈశ్వర్ 70 - అత్తాపూర్ | సంపూర్ణ 70ఎంఎం - వనస్థలిపురం | వైజయంతి 70 ఎంఎం - నాచారం
ఇంద్ర నాగేంద్ర కాంప్లెక్స్ - కర్మన్‌ఘాట్ | అంజలి 70ఎంఎం - సికింద్రాబాద్ | అలంకార్ 70 - లంగర్‌హౌస్
శ్రీరాములు ఎ/సి - మూసాపేట్ | సంగీత 70 - ఆర్.సి.పురం | సాయిరంగ 70 - మియాపూర్
లక్ష్మీకళ సినీప్లెక్స్ - మూసాపేట్ | శివశక్తి 70 ఎంఎం - కాప్రా | శ్రీ సాయిపూజా 70 ఎ/సి - సూరారం
మహాలక్ష్మి కాంప్లెక్స్ - కొత్తపేట | శ్రీరమణ 70ఎంఎం - అంబర్‌పేట | శ్రీకృష్ణ 70ఎంఎం - అలియాబాద్
తాళ్కూరి కాంప్లెక్స్ - ఇ.సి.ఐ.ఎల్ | శ్రీ సాయిరాం 70 - మల్కాజ్‌గిరి | శ్రీదేవి 70 - చిలకలగూడ
గోకుల్ 70 ఎ/సి - ఎర్రగడ్డ | శ్రీ కృష్ణ 70 ఎ/సి - ఉప్పల్ | సర్దార్ 70 ఎ/సి - అల్వాల్
రంగా 70 ఎంఎం - జీడిమెట్ల | స్వప్న 70 ఎ/సి - కాటేదాన్ | గణేష్ 70 ఎంఎం - శంషాబాద్

BHUVANESHWARI PICTURES

ఈనెల 15న బ్రహ్మాండమైన విడుదల



సప్తగిరి 70 ఎంఎం - ఎ/సి, ఆర్.టి.సి. క్రాస్ రోడ్స్

SRI VIJAYA FILMS

ఈనెల 15న బ్రహ్మాండమైన విడుదల



SRI LAKSHMI PICTURES 9885291789

ఈనెల 15న బ్రహ్మాండమైన విడుదల



ఈనెల 15న బ్రహ్మాండమైన విడుదల



DISTRIBUTION BY PVR INOX PICTURES

ఏపీలో చంద్రబాబుపై మరో కేసు

» అసైన్డ్ భూముల కేసులో ఏ-40గా చేర్చిన సీఐడీ

విజయవాడ, మార్చి 11 (ఆంధ్రజ్యోతి): టీడీపీ అధినేత చంద్రబాబుపై రాష్ట్ర ప్రభుత్వం మరో కేసు నమోదు చేసింది. ఇప్పటి వరకు స్కిల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్, ఫైబర్‌గ్రిడ్ కేసుల్లో నిందితుడిగా చేర్చిన సీఐడీ.. తాజాగా అసైన్డ్ భూముల కేసు ఎఫ్ఐఆర్‌లోనే గాక చార్జిషీటులోనూ నిందితుడి(ఏ-40)గా పేర్కొంది. రాజధాని అమరావతిలో వెలగపూడి, ఉద్దండరాయునిపాలెం, మందడం, రాయపూడి గ్రామాల్లో ఉన్న అసైన్డ్ భూములను బినామీ పేర్లతో కొనుగోలు చేశారని వరప్రసాదరావు అనే వ్యక్తి ఇచ్చిన ఫిర్యాదుపై మాజీ మంత్రి పి.నారాయణ, ఆయన కుటుంబ సభ్యులపై సీఐడీ గతంలో కేసులు (క్రైం నంబర్ 14/2020, 15/2020) నమోదు చేసింది. ఈ ఎఫ్ఐఆర్‌లలో ఎక్కడా చంద్రబాబు పేరు లేదు. ఇప్పుడు 14/2020 కేసులో ఆయనతో పాటు 22 మందిని నిందితులుగా పేర్కొంటూ విజయవాడ ఏసీబీ కోర్టులో సోమవారం చార్జిషీటు, మెమో దాఖలు చేసింది. వీరిలో నారాయణ బంధువు పి.సుబ్రహ్మణ్యాన్ని ఏ-41గా చేర్చింది. వీరందరిపై ఐపీసీ 120బీ, 420, 506 రెడ్‌విత్ 120బీ సెక్షన్లు, అసైన్డ్ భూముల బదిలీ నిషేధం చట్టంలోని సెక్షన్ 7, ఎస్సీ ఎస్టీ చట్టంలోని 3(1)(జీ), (2)(వీఏ) సెక్షన్ల కింద కేసులు నమోదు చేశారు. 2 కేసులకు సంబంధించి ఒకటే చార్జిషీటును కోర్టుకు సమర్పించారు. కాగా, యువగళం ముగింపు సభలో లోకేశ్ చేసిన రెడ్‌బుక్ వ్యాఖ్యలపై సీఐడీ వేసిన పిటిషన్‌పై విచారణ 21వ తేదీకి వాయిదా వేసింది. ఈ వ్యవహారంలో కౌంటర్ దాఖలుకు ఆయన తరఫు న్యాయవాది లక్ష్మీనారాయణ సమయం కోరారు. ఈ కేసుకు సంబంధించిన పిటిషన్లు సుప్రీంకోర్టులో పెండింగ్‌లో ఉన్నాయని తెలిపారు. దీంతో న్యాయాధికారి హిమబిందు విచారణను 21వ తేదీకి వాయిదా వేశారు.



రంజాన్‌కు ముస్తాబైన మక్కా మసీద్

నేటి నుంచే రంజాన్

(మొదటి పేజీ తరువాయి)

ముస్లింలు భావిస్తారు. అలాగే ఎంతో శుభప్రదమైన ఈ నెలలో నరకలోక ద్వారాలు మూసుకుని, స్వర్గలోకపు ద్వారాలు తెరుచుకుంటాయని వారు నమ్ముతారు. దేవునిపై విశ్వాసాన్ని, భయభక్తులను, భక్తిశ్రద్ధలను తెలుపుకునేందుకు ముస్లింలు రోజా (ఉపవాస దీక్షలు) పాటిస్తారు. నెల రోజుల పాటు ఉపవాస దీక్షలు పాటిస్తూ ఐదుపూటలా నమాజు, ఇషా తరువాత తరావీహ్ (ప్రత్యేక ప్రార్థనలే)తో పాటు అర్ధరాత్రి పూట తహజ్జుద్ నమాజ్ పేరుతో ఏకాంత ఆరాధనలో లీనమవుతుంటారు. చివరి పది రోజులలో ఎతేకాఫ్ పాటిస్తారు. అలాగే ధనవంతుడైన ప్రతి ముస్లిం దానధర్మాలకు అధిక ప్రాధాన్యమిస్తారు. తమ ఆస్తిలో రెండున్నర శాతం తీసి పేదలకు పంచిపెడతారు. నెల రోజుల అనంతరం నెలవంక దర్శనంతో ఉపవాస దీక్షలను ముగించి రంజాన్ పండుగ (ఈదుల్ ఫితర్)ను జరుపుకుంటారు. మరోవైపు రంజాన్ నెలవంక దర్శనంతో సోమవారం రాత్రి హైదరాబాద్‌లోని పాతబస్తీలో మటన్, చికెన్ షాపులు, కూరగాయల మార్కెట్‌లు, కిరాణా షాపులు కొనుగోలుదారులతో కిటకిటలాడాయి.

ముస్లింలకు సీఎం రంజాన్ శుభాకాంక్షలు

నెలవంక దర్శనంతో పవిత్ర రంజాన్ మాసం ప్రారంభమైన సందర్భంగా ముస్లింలకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి శుభాకాంక్షలు తెలిపారు. రంజాన్ మాసం ఆదర్శవంతమైన జీవనానికి ప్రేరణనిస్తుందని అన్నారు. ముస్లిం సోదరులు రంజాన్ మాస వేడుకలను సుఖసంతోషాలతో జరుపుకోవాలని, ప్రార్థనలతో అల్లా దీవెనలు పొందాలని ఆయన ఆకాంక్షించారు. ముస్లిం మైనారిటీల అభ్యున్నతి కోసం రాష్ట్ర ప్రభుత్వం చిత్తశుద్ధితో పని చేస్తుందని చెప్పారు. ముస్లింల సంక్షేమానికి అవసరమైన నిధులు కేటాయించి, వారి అభ్యున్నతికి తోడ్పడే కార్యక్రమాలు అమలు చేస్తామని రేవంత్ రెడ్డి పేర్కొన్నారు.

ఆనాడు కేసీఆర్ పేషీలో

ఒక్క దళితుడున్నారా?

చిన్న సంఘటనపై బీఆర్ఎస్ విష ప్రచారం.. ప్రభుత్వ విప్‌లు అడ్లూరి లక్ష్మణ్, బీర్ల అయిలయ్య

హైదరాబాద్/న్యూఢిల్లీ/జగిత్యాల, మార్చి 11 (ఆంధ్రజ్యోతి): కేసీఆర్ సీఎంగా ఉన్నప్పుడు ఆయన పేషీలో ఒక్క దళితుడైనా ఉన్నారా అంటూ ప్రభుత్వ విప్ అడ్లూరి లక్ష్మణ్ కుమార్ ప్రశ్నించారు. యాదగిరిగుట్టలో జరిగిన చిన్న సంఘటనను చూపి ఏదో అయినట్లు బీఆర్ఎస్ సోషల్ మీడియా తప్పుడు చేస్తోందని మండిపడ్డారు. సోమవారం గాంధీభవన్‌లో మీడియాతో ఆయన మాట్లాడారు.. తెలంగాణ తొలి సీఎంగా దళితుడిని చేస్తానన్న కేసీఆర్.. చేశాడా అని ప్రశ్నించారు. మాజీ డిప్యూటీ సీఎం రాజయ్య, మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్‌ను ఆయన ఎలా అవమానించిందీ ప్రజలే చూశారన్నారు. కేసీఆర్ సీఎంగా ఉన్నప్పుడు దళిత మంత్రులు ఎన్నిసార్లు కలవగలిగారని ప్రశ్నించారు. యాదగిరిగుట్టలో పూర్వమున్న వసతులనూ సీఎం రేవంత్ కల్పిస్తున్నారని.. గుట్టలో నిద్రచేసే వెసులుబాటు, కొబ్బరికాయలు కొట్టేందుకు ఏర్పాట్లు చేశారని విప్ అయిలయ్య అన్నారు. కాంగ్రెస్‌కు క్రెడిట్ దక్కుతుందని చెప్పి.. డిప్యూటీ సీఎం భట్టికి అవమానం జరిగిందంటూ బీఆర్ఎస్ విష ప్రచారం చేస్తుందని దుయ్యబట్టారు. భట్టి కూర్చున్న కుర్చీ చిన్నగా ఉన్నందు వల్ల అలా కనిపిస్తోందని వివరణ ఇచ్చారు. మేనేజ్‌మెంట్ కోటాలో వచ్చిన కేటీఆర్‌కు.. సీఎం రేవంత్‌రెడ్డిని విమర్శించే స్థాయి లేదని కాంగ్రెస్ ఎంపీ అనిల్‌కుమార్ అన్నారు. సీఎంను గురించి ఆయన పిచ్చిమాటలు మాట్లాడితే ఎర్రగడ్డ మెంటల్ ఆస్పత్రిలో చేర్చడం ఖాయమని వ్యాఖ్యానించారు. రేవంత్ గురించి అనవసర వ్యాఖ్యలు చేస్తే హైదరాబాద్‌లో తిరగనివ్వబోమని హెచ్చరించారు. తెలంగాణ ప్రజల్లో సీఎం రేవంత్‌కు ఉన్న ఆదరణ చూసి కేటీఆర్ ఓర్చుకోలేకపోతున్నారని ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం అన్నారు. 'బిడ్డా కేటీఆర్..! మా సీఎం రేవంత్‌పైన మాట్లాడే స్థాయి నీకుందా? నీ భాష మార్చుకోక పోతే బట్టలు ఊడదీసి ఉరికిస్తం.. నువ్వు మొగోనివైతే లోక్‌సభ ఎన్నికల్లో సిరిసిల్లలో మెజారిటీ తెచ్చి చూపించు!'అని సవాల్ విసిరారు. రేవంత్ పట్ల కేటీఆర్ మాట్లాడిన తీరు జుగుప్సాకరంగా ఉందంటూ టీపీసీసీ సీనియర్ ఉపాధ్యక్షుడు మల్లు రవి అన్నారు. కేసీఆర్ ఎక్కడ రాజకీయాలు మొదలుపెట్టి ఎక్కడ మంత్రి, డిప్యూటీస్పీకర్ అయ్యారో కేటీఆర్ చెప్పాలన్నారు. కేటీఆర్ ఇలాగే మాట్లాడితే తెలంగాణ ప్రజలు.. బీఆర్ఎస్‌కు ఉన్న ప్రతిపక్ష హోదా లేకుండా చేసి బయటకు పంపుతారన్నారు.



జగిత్యాల మునిసిపల్ చైర్‌పర్సన్ అడువాల జ్యోతికి కాంగ్రెస్ కండువా కప్పుతున్న ఎమ్మెల్సీ జీవన్ రెడ్డి

రెండ్రోజుల్లో గొల్లకురమల కార్పొరేషన్

గొల్ల, కురమల కార్పొరేషన్‌ను మరో రెండ్రోజుల్లో ప్రభుత్వం ఏర్పాటు చేయనున్నట్లు విప్ బీర్ల అయిలయ్య తెలిపారు. గాంధీ భవన్‌లో ఆయన మాట్లాడుతూ.. కార్పొరేషన్ ఏర్పాటుతో గొల్ల, కురుమలకు లబ్ధి చేకూర్చుతుందన్నారు. గొల్ల కురమలకు బీఆర్ఎస్ పదేళ్ల పాటు అన్యాయం చేసిందని మండిపడ్డారు. గొల్ల కురుమలకు 4 అసెంబ్లీ సీట్లు కేటాయించి.. అధికారంలోకి రాగానే కార్పొరేషన్ ఏర్పాటు చేస్తామని ఇచ్చిన హామీని సీఎం రేవంత్ నిలబెట్టుకుంటున్నారని వెల్లడించారు.

మోదీకి చిత్తశుద్ధి లేదు:వీహెచ్

ఓబీసీ ప్రధాని అని చెప్పుకొనే నరేంద్ర మోదీ తెలంగాణకు వచ్చి బీసీలకు ఏం చెప్తారని కాంగ్రెస్ సీనియర్ నేత వి.హనుమంతరావు ప్రశ్నించారు. కులగణన చేస్తామని ప్రకటించడానికి వస్తున్నారా? అని నిలదీశారు. ఓట్ల కోసం అయోధ్య రామమందిరం, కాశీ గురించి మాట్లాడడమే తప్ప బీసీల అభివృద్ధి పట్ల ఆయనకు చిత్తశుద్ధి లేదని విమర్శించారు. ఢిల్లీలోని తెలంగాణ భవన్‌లో మీడియాతో వీహెచ్ మాట్లాడుతూ.. కులగణన కోసం మోదీని ఓబీసీ ఎంపీల బృందం ఆధ్వర్యంలో నాలుగు సార్లు కలిసినప్పటికీ హామీ ఇవ్వలేదన్నారు. కాగా, జగిత్యాలలో ఇటీవల జరిగిన మునిసిపల్ చైర్‌పర్సన్ ఎన్నికల్లో బీఆర్ఎస్ రెబల్‌గా పోటీ చేసి విజయం సాధించిన అడువాల జ్యోతి లక్ష్మణ్ కాంగ్రెస్‌లో చేరారు. సోమవారం జగిత్యాలలో జరిగిన కార్యక్రమంలో ఆమెకు ఎమ్మెల్సీ జీవన్ రెడ్డి కండువా కప్పి కాంగ్రెస్‌లోకి ఆహ్వానించారు.

22 ఎకరాల నిషేధిత జాబితా భూమి..

ఎంపీ సంతోష్‌కు పట్టా

(మొదటి పేజీ తరువాయి)

తెలిపారు. "సంతోష్ అనే బీఆర్ఎస్ ఎంపీ, వారి కుటుంబానికి చెందినవారి పేరుమీద కూడా భూములున్నాయి. అప్పటివరకు 22(ఎ) కింద నిషేధిత జాబితాలో ఉన్న భూమి వారి పేరిట పట్టా అయింది. ఆ గ్రామంలో అందరి భూములూ నిషేధిత జాబితాలో ఉంటాయి. కానీ, ఆయనకు మాత్రం ఆ 22 ఎకరాలు పట్టా అయిపోయింది" అని కోదండరెడ్డి అన్నారు. ఎంపీ సంతోష్ భార్య, ఓ ఎమ్మెల్సీ, ఇద్దరు ఆ పార్టీ నేతలు కలిసి ఒకే గ్రామంలో నిషేధిత జాబితాలో ఉన్న 22 ఎకరాలను తమ పేరిట రిజిస్ట్రేషన్ చేసుకున్నారని తెలిపారు. ఈ నలుగురికి చెందిన ఒక కంపెనీ పేరుతో ఈ భూముల్ని రిజిస్ట్రేషన్ చేసుకున్నారని వెల్లడించారు. నిషేధిత జాబితాలో ఉన్న భూములను ఎలా పట్టాలుగా మార్చుకున్నారనేందుకు ఇది ఒక్క ఉదాహరణ మాత్రమేనన్నారు. ఇలాంటి రిజిస్ట్రేషన్లపై తాము ప్రతిపక్షంలో ఉన్నప్పుడు పీసీసీ అధ్యక్షుడిగా రేవంత్‌రెడ్డి ఫిర్యాదులు ఇచ్చినా పట్టించుకోలేదన్నారు. మరోవైపు వివాదరహితంగా ఉన్న 23 లక్షల ఎకరాలను వివాదాస్పద భూముల కేటగిరీ(బీ)లో చేర్చారని తెలిపారు. దేశంలో ఏ రాష్ట్రంలోనూ జరగనన్ని భూ కుంభకోణాలు ఇక్కడ గత ప్రభుత్వ హయాంలో జరిగాయని ధ్వజమెత్తారు. ఎవరినీ సంప్రదించకుండా గతంలో దివాళా తీసిన విదేశీ ఐఎల్ అండ్ ఎఫ్ఎస్ కంపెనీకి ధరణి నిర్వహణ బాధ్యతలు అప్పగించారని కోదండరెడ్డి తెలిపారు. ఆ తర్వాత ఇదే కంపెనీ టెరాసీస్, క్వాంటెల్లాగా పేర్లు మార్చుకుందని వివరించారు. ఈ మూడు కంపెనీలు రాష్ట్రానికి చెందిన రామలింగరాజు కుటుంబీకుడు శ్రీగారి శ్రీధర్‌రాజు పేరిట ఉన్నాయని తెలిపారు. రామలింగరాజు కుటుంబానికి కేటీఆర్‌తో అవినాభావ సంబంధం ఉందన్నారు. ధరణి పేరుతో కేసీఆర్ ప్రభుత్వం రెవెన్యూ వ్యవస్థను అస్తవ్యస్తం చేసిందని, ఆ శాఖ మంత్రిగా కూడా ఉన్న గత సీఎం కేసీఆర్, మాజీ మంత్రి కేటీఆర్ దీనికి ప్రధాన కారణమని కోదండరెడ్డి ఆరోపించారు. కేటీఆర్ తన కార్యాలయంలో ధరణికి సంబంధించి ప్రత్యేకంగా ఒక వ్యవస్థనే పెట్టుకున్నారని తెలిపారు.

17 వరకు స్పెషల్ డ్రైవ్..

ధరణి సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం ప్రారంభించిన స్పెషల్ డ్రైవ్‌ను మరో వారం రోజులపాటు పొడిగించారు. దరఖాస్తులు భారీగా వస్తున్నందున దీనిని ఈ నెల 17 వరకు పొడిగిస్తున్నట్లు పేర్కొంటూ ప్రభుత్వం సోమవారం ఉత్తర్వులు జారీ చేసింది. ఇప్పటివరకు 2.45 లక్షల ధరణి దరఖాస్తులు పరిష్కారం దిశగా ఉన్నాయని తెలిపింది.

ప్రణీత్‌రావు ఎక్కడ?

- » సిరిసిల్లలో పంజాగుట్ట పోలీసుల గాలింపు
- » అదుపులోకి తీసుకున్నట్లుగానూ ప్రచారం?
- » పథకం ప్రకారమే ట్యాపింగ్.. డేటా మాయం
- » హార్డ్ డిస్కుల ధ్వంసం కేసులో కీలక ఆధారాలు
- » గత ప్రభుత్వ పెద్దల అండతో ఎస్ఐబీలో హవా
- » ప్రతిఫలంగానే అడ్డదారిలో ఆయనకు పదోన్నతి?
- » ప్రణీత్‌కు సహకరించిన అధికారుల్లో గుబులు

హైదరాబాద్ సిటీ, సిరిసిల్ల క్రైం, మార్చి 11(ఆంధ్రజ్యోతి): ఫోన్ ట్యాపింగ్ వ్యవహారంలో సస్పెండైన డీఎస్పీ ప్రణీత్‌కుమార్ అలియాస్ ప్రణీత్‌రావు ఎక్కడ ఉన్నారనేది తెలియడం లేదు. ఫోన్‌లు స్విచ్ఛాఫ్ ఉండడంతో పాటు, అజ్ఞాతంలోకి వెళ్లినట్లు అనుమానిస్తూ ఆయనను పట్టుకునేందుకు హైదరాబాద్ పంజాగుట్ట పోలీసులు ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేశారు. సోమవారం వీరు సిరిసిల్ల వచ్చి స్థానిక శ్రీనగర్ కాలనీలో ప్రణీత్ అద్దెకు ఉంటున్న ఇంటి వద్ద రాత్రి వరకు పహారా కాసినట్లు తెలిసింది. ఓ దశలో అదుపులోకి తీసుకున్నారని, రహస్య ప్రాంతంలో విచారిస్తున్నట్లు ప్రచారం జరిగింది. ఏ సమయంలోనైనా హైదరాబాద్ తరలించే అవకాశం ఉందని ఊహాగానాలు వచ్చాయి. అయితే, ప్రణీత్ విషయం తమకు తెలియదని, పంజాగుట్ట పోలీసులకే సమాచారం ఉంటుందని సిరిసిల్ల ఎస్పీ అఖిల్ మహాజన్ తెలిపారు. పంజాగుట్ట పోలీసులు సైతం ప్రణీత్ ఇంకా దొరకలేదని చెప్పారు. హైదరాబాద్‌లోని స్పెషల్ ఇంటిలిజెన్స్ బ్రాంచ్ (ఎస్ఐబీ) డీఎస్పీగా పనిచేస్తున్న ప్రణీత్ ఫిబ్రవరి 20న బదిలీపై సిరిసిల్ల డీసీఆర్బీలో చేరారు. రిపోర్టు చేసిన వెంటనే హైదరాబాద్ వెళ్లిపోయినట్లు తెలిసింది. ట్యాపింగ్ ఆరోపణలతో ఈ నెల 5న సస్పెండయ్యారు. కాగా, ఎస్ఐబీ కార్యాలయంలో.. అసెంబ్లీ ఎన్నికల ఫలితాలు వచ్చిన మరుసటి రోజు ప్రతిపక్ష నాయకుల ఫోన్ల ట్యాపింగ్‌కు సంబంధించిన హార్డ్ డిస్కులను ప్రణీత్ ధ్వంసం చేశారని ఆదివారం అదనపు ఎస్పీ రమేష్ పంజాగుట్ట పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. పలు సెక్షన్ల కింద కేసు నమోదైంది. ప్రణీత్‌తో పాటు, మరికొందరిపై పంజాగుట్ట స్టేషన్‌లో ఐపీసీ 409, 427, 201, 120(బి), సెక్షన్(3) ఆఫ్ పీడీపీపీ యాక్ట్, 65, 66, 70 ఆఫ్ ఐటీ యాక్ట్ కింద కేసులు నమోదయ్యాయి.

పథకం ప్రకారం ఎస్ఐబీకి.. 'అద్భుత పనితీరు'తో డీఎస్పీ

గత ప్రభుత్వంలోని పెద్దలతో దగ్గరి బంధుత్వం ఉండడం, వారి అండతో ప్రణీత్ పథకం ప్రకారం ఎస్ఐబీకి వెళ్లి చక్రంతిప్పినట్లు పోలీసులు కీలక సమాచారం సేకరించారు. 2007 ఎస్ఐ బ్యాచ్‌కు చెందిన ఆయన 2018లో ఇన్‌స్పెక్టర్‌గా పదోన్నతి పొందారు. అనంతరం ఎస్ఐబీకి మార్చగా ఆ విభాగం ఉన్నతాధికారుల తోడ్పాటుతో రెండు గదుల్లో ఇంటర్నెట్ కనెక్షన్‌తో 17 కంప్యూటర్లను అనధికారికంగా ఏర్పాటు చేసుకున్నారు. వ్యక్తుల సమాచారాన్ని రహస్యంగా, అనధికారికంగా, చట్ట విరుద్ధంగా సేకరించడమే కాక స్వయంగా పర్యవేక్షించినట్లు కచ్చితమైన ఆధారాలు లభించినట్లు తెలిసింది. ఎన్నికల ఫలితాలు విడుదలైన మరుసటి రోజే ఎస్ఐబీ కార్యాలయంలో సీసీ కెమెరాలు బంద్ చేయించి, టెక్నీషియన్ సాయంతో కంప్యూటర్లలోని డేటా, కీలక వివరాలు కాపీ చేసుకుని, హార్డ్ డిస్కులను ధ్వంసం చేసి కాల్చివేశారు. తనపై అనుమానం రాకుండా కొత్త హార్డ్ డిస్కులను ఏర్పాటు చేసినట్లు విచారణలో తేలింది. కాగా, చెప్పినట్లు చేసినందుకు 'అద్భుతమైన పనితీరు' కింద నిరుడు మార్చిలో ప్రణీత్‌కు డీఎస్పీగా పదోన్నతి ఇచ్చారు. దీనిపై ఆయన బ్యాచ్‌మేట్స్, ఉన్నతాధికారులు సైతం ఆశ్చర్యపోయినట్లు తెలిసింది. మరోవైపు ట్యాపింగ్‌లో కొందరు అధికారులకూ పాత్ర ఉన్నట్లు ఆధారాలు లభ్యమయ్యాయి. ప్రణీత్ తర్వాత వీరినీ విచారించే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది. ప్రాథమిక సమాచారం మేరకు ఈ కుట్రలో ఎవరి పాత్ర ఎంత..? అనేది దానిపై దర్యాప్తు చేస్తున్నారు. కేసు సంచలనంగా మారుతుండడంతో ప్రణీత్ కు సహకరించిన ఉన్నతాధికారుల్లో గుబులు మొదలైంది.

సీఎం సార్... మా మొర ఆలకించండి!

- » ఆర్ అండ్ బీలో సర్వీస్ రూల్స్ ఖరారు చేయండి
- » సీఎం రేవంత్‌కు, మంత్రి కోమటిరెడ్డికి ఉద్యోగుల విజ్ఞప్తి

హైదరాబాద్, మార్చి 11 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర రోడ్లు, భవనాలశాఖలో ఏళ్ల తరబడి పెండింగ్‌లో ఉన్న సర్వీస్ రూల్స్ అంశాన్ని పరిష్కరించాలని ఆ శాఖ ఉద్యోగులు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డిని కోరారు. గత ప్రభుత్వం ఈ విషయంలో నిర్లక్ష్యంగా వ్యవహరించిందని, దాంతో తమకు పదోన్నతులు వచ్చినా అవి తాత్కాలికమే కావడంతో డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ స్థాయి హోదాలోనే పదవీ విరమణ చేయాల్సి వస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వమైనా ఆర్ అండ్ బీ లో పెండింగ్‌లో ఉన్న సర్వీస్ రూల్స్‌ను పరిష్కరిస్తే దాదాపు 300 నుంచి 400 మంది ఉద్యోగులకు పదోన్నతులు కలుగుతాయన్నారు. వాస్తవానికి ఆర్ అండ్ బీ పదోన్నతుల అంశం ఆంధ్రప్రదేశ్ నుంచి రావాల్సిన సీనియారిటీ జాబితాపై ఆధారపడి ఉన్నప్పటికీ సర్వీస్ రూల్స్ తేలితే కిందిస్థాయి పదోన్నతులు ఒక కొలిక్కి వస్తాయని ఉద్యోగులు చెబుతున్నారు. గత ప్రభుత్వ హయాంలో ఇరిగేషన్, పంచాయతీ రాజ్, ఆర్‌డబ్ల్యూఎస్ శాఖల్లో సర్వీస్ రూల్స్ పూర్తయ్యాయని, తమ శాఖలోనూ అందుకు సంబంధించిన ప్రక్రియ మొత్తం పూర్తయినా గత ప్రభుత్వం పట్టించుకోకపోవడంతో పెండింగ్‌లో ఉండిపోయిందని పలువురు ఉద్యోగులు 'ఆంధ్రజ్యోతి'తో అన్నారు. కాగా సర్వీస్‌రూల్స్‌ను ఖరారు చేస్తే ఆర్ అండ్ బీలో జరిగిన పునర్వ్యవస్థీకరణతో ఏర్పడిన కొత్త కార్యాలయాలకు సిబ్బంది పూర్తిస్థాయిలో వచ్చే అవకాశం ఉంటుందన్నారు.

తవ్విన కొద్దీ బయటపడుతున్న

అక్రమ పౌరసత్వాలు!

» తాజాగా 125 పెరిగిన సంఖ్య.. 24 మంది అరెస్టు

హైదరాబాద్, మార్చి 11 (ఆంధ్రజ్యోతి): విదేశీయులకు అడ్డదారుల్లో పౌరసత్వం ఇచ్చిన కేసులో సీఐడీ దర్యాప్తును ముమ్మరం చేసింది. భారత్‌లోకి అక్రమంగా ప్రవేశించి.. నకిలీ గుర్తింపు, విద్య, ఇతర ధ్రువీకరణ పత్రాలు పొంది.. వాటి ఆధారంగా పాస్‌పోర్టులు పొందిన వారి సంఖ్య తొలుత 95గా గుర్తించిన విషయం తెలిసిందే. ఈ కేసుకు అనుబంధంగా మరికొన్ని చోట్ల ఎఫ్ఐఆర్‌లు నమోదవుతుండడం.. ఈ ముఠాలకు పశ్చిమబెంగాల్‌లోని ఫేక్ సర్టిఫికెట్ల గ్యాంగ్‌తో లింకులను సీఐడీ నిర్ధారించింది. కొత్తగా మరో 30 మంది ఇలా అక్రమంగా పాస్‌పోర్టులు తీసుకున్నట్లు గుర్తించారు. దీంతో.. నకిలీ పత్రాలతో పౌరసత్వాన్ని పొందిన విదేశీయుల సంఖ్య 125కు చేరింది. చెన్నైకి చెందిన పాస్‌పోర్టు ఏజెంట్ మురళీధరన్ రాధ ఈ కేసులో కీలకంగా వ్యవహరించినట్లు తేల్చారు. మరింత లోతుగా దర్యాప్తు చేస్తే.. ఈ సంఖ్య మరింత పెరుగుతుందని అభిప్రాయపడుతున్నారు. కాగా.. ఈ కేసులో సీఐడీ ఇప్పటి వరకు 24 మందిని అరెస్టు చేసింది. విదేశాలకు వెళ్లినట్లు గుర్తించిన వ్యక్తుల వివరాలను ఇప్పటికే ఇమిగ్రేషన్, పాస్‌పోర్టు అధికారులు అందజేశామని, వారిని భారత్‌కు రప్పించే ఏర్పాట్లు జరుగుతున్నాయని సీఐడీ అధికారులు వెల్లడించారు. ఇప్పటి వరకు అరెస్టయిన వారిలో హైదరాబాద్‌కు చెందిన ఫేక్‌సర్టిఫికెట్ల తయారీదారుడు అబ్దుల్ సత్తార్, డి.అశోక్‌రావు, మరియప్పన్, మునీందర్, చాంద్‌ఖాన్, హబీబుల్లా జైలులో ఉండగా.. మిగతా వారు బెయిల్‌పై బయటకు వచ్చారు.

ఏపీలో బీజేపీకి 6 ఎంపీ, 10 అసెంబ్లీ సీట్లు

- » 144 అసెంబ్లీ, 17 లోక్‌సభ స్థానాల్లో టీడీపీ పోటీ
- » 8 గంటలపాటు మూడు పార్టీల నేతల భేటీ

అమరావతి, మార్చి 11 (ఆంధ్రజ్యోతి): పొత్తుల్లో ఎవరికి ఎన్ని సీట్లు అనే అంశంపై టీడీపీ, జనసేన, బీజేపీ తుది నిర్ణయానికి వచ్చాయి. సోమవారం టీడీపీ అధ్యక్షుడు చంద్రబాబు, జనసేన అధ్యక్షుడు పవన్ కల్యాణ్, బీజేపీ ప్రతినిధులుగా కేంద్ర మంత్రి గజేంద్రసింగ్ షెకావత్, ఎంపీ బైజయంత్ పాండే సుమారు 8 గంటలు చర్చలు జరిపారు. ఉండవల్లిలోని చంద్రబాబు నివాసంలో ఈ భేటీ జరిగింది. అనంతరం... ఏ పార్టీ ఎన్ని సీట్లలో పోటీ చేయనున్నదీ వివరిస్తూ సంయుక్త ప్రకటన విడుదల చేశారు. దీని ప్రకారం... తెలుగుదేశం పార్టీ 17 పార్లమెంటు, 144 అసెంబ్లీ స్థానాల్లో పోటీ చేస్తుంది. జనసేన రెండు లోక్‌సభ, 21 అసెంబ్లీ స్థానాల్లో బరిలో దిగనుంది. ఇక... బీజేపీ ఆరు పార్లమెంటు, పది అసెంబ్లీ స్థానాల్లో పోటీ చేయనుంది. పొత్తుల్లో భాగంగా బీజేపీ, జనసేనకు కలిపి 8 పార్లమెంటు, 30 అసెంబ్లీ స్థానాలను ఇవ్వాలని తొలుత భావించారు. ఇప్పుడు... అసెంబ్లీ స్థానాల సంఖ్య 31కి పెరిగింది. తొలుత జనసేనకు 24 అసెంబ్లీ, మూడు పార్లమెంటు సీట్లు ఇచ్చారు. బీజేపీతో పొత్తు అనంతరం జనసేన ఒక ఎంపీ స్థానాన్ని, 3 అసెంబ్లీ స్థానాలను త్యాగం చేయాల్సి వచ్చింది. టీడీపీ కూడా ఒక అసెంబ్లీ స్థానాన్ని తగ్గించుకోవాల్సి వచ్చింది.

వివేకా హత్య కేసులో శివశంకర్‌రెడ్డికి బెయిల్

- » సీబీఐ కోర్టు అనుమతి లేకుండా ఆంధ్రలో అడుగుపెట్టొద్దు
- » రెండు పూచీకత్తులు సమర్పించాలి: తెలంగాణ హైకోర్టు

హైదరాబాద్, మార్చి 11 (ఆంధ్రజ్యోతి): సీఎం జగన్మోహన్‌రెడ్డి చిన్నాన్న, మాజీ మంత్రి వైఎస్ వివేకానంద రెడ్డి హత్య కేసులో కీలక నిందితుడు (ఏ-5) దేవిరెడ్డి శివశంకర్‌రెడ్డికి తెలంగాణ హైకోర్టు సోమవారం షరతులతో కూడిన బెయిల్ మంజూరు చేసింది. ఈ కేసులో అధిక శాతం సాక్షులు ఉన్న ఆంధ్ర రాష్ట్రంలోకి సీబీఐ కోర్టు అనుమతి లేకుండా ప్రవేశించరాదని స్పష్టం చేసింది. రూ.2 లక్షల వ్యక్తిగత బాండ్, రెండు పూచీకత్తులు సమర్పించాలని.. ప్రతి సోమవారం హైదరాబాద్ సెంట్రల్ క్రైం స్టేషన్ (సీసీఎస్)లో రిపోర్ట్ చేయాలని ఆదేశించింది. పిటిషనర్ సీబీఐ కోర్టులో పాస్‌పోర్ట్ సరెండర్ చేయాలని.. దర్యాప్తునకు సహకరించాలని పేర్కొంది. ఈ మేరకు న్యాయమూర్తి జస్టిస్ కె.లక్ష్మణ్ సోమవారం ఆదేశాలిచ్చారు. శివశంకర్‌రెడ్డి దాఖలు చేసిన బెయిల్ పిటిషన్‌ను గతేడాది సెప్టెంబర్లో హైదరాబాద్ సీబీఐ కోర్టు కొట్టివేసింది. ఈ హత్య కేసులో 2021 నవంబర్ నుంచి జైల్లో ఉంటున్నానని.. సీబీఐ కోర్టు ఇచ్చిన ఆదేశాలను కొట్టేసి బెయిల్ మంజూరు చేయాలని ఆయన తెలంగాణ హైకోర్టును ఆశ్రయించారు. ఈ పిటిషన్‌పై జస్టిస్ కె.లక్ష్మణ్ ధర్మాసనం విచారణ చేపట్టింది. ఈ మేరకు ఆయనకు షరతులతో కూడిన బెయిల్ మంజూరు చేస్తున్నట్లు పేర్కొంది. ఆయన సాక్షులను ప్రభావితం చేస్తే సీబీఐ లేదా సునీతారెడ్డి ఆయన బెయిల్ రద్దుచేయాలని కోరవచ్చంటూ విచారణను ముగించింది.

జేబీబీ పార్టీలో చేరిన కోడికత్తి శ్రీను

» అమలాపురం నుంచి ఎన్నికల బరిలోకి...

విజయవాడ(ఆంధ్రజ్యోతి), ముమ్మిడివరం, మార్చి 11: జనిపల్లి శ్రీనివాసరావు(కోడికత్తి శ్రీను) రాజకీయ రంగప్రవేశం చేశారు. సోమవారం ఆయన జై భీమ్‌రావ్ భారత్ పార్టీలో చేరారు. విజయవాడలోని ఆ పార్టీ కార్యాలయంలో అధ్యక్షుడు శ్రావణ్‌కుమార్ ఆయనను పార్టీలోకి ఆహ్వానించారు. కాగా, డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా ముమ్మిడివరం మండలం ఠాణేలంక పెదపేటలో సోమవారం ఆయన మీడియాతో మాట్లాడారు. సమాజంలో సామాన్యులకు న్యాయం జరిగే వరకు తాను పోరాటం సాగిస్తానని ప్రకటించారు. ప్రభుత్వం సంక్షేమ పథకాలు అమలుచేస్తున్నా అవి సక్రమంగా అర్హులకు చేరడం లేదన్నారు. అమలాపురం అసెంబ్లీ స్థానం నుంచి ఎన్నికల్లో పోటీ చేస్తానని ప్రకటించారు.

మా కుటుంబం త్వరలోనే టీడీపీలోకి: మాగుంట

ఒంగోలు(కలెక్టరేట్), మార్చి 11: రాష్ట్రంలో టీడీపీ, జనసేన, బీజేపీ కలయికతో అద్భుతాలు జరుగడం ఖాయమని ఒంగోలు ఎంపీ మాగుంట శ్రీనివాసులరెడ్డి అన్నారు. ప్రకాశం జిల్లాలో కూటమి అభ్యర్థులు విజయకేతనం ఎగురవేసే విధంగా కృషిచేస్తానని తెలిపారు. సోమవారమిక్కడ ఉమ్మడి ప్రకాశం జిల్లా టీడీపీ మాజీ ఎమ్మెల్యేలు, నియోజకవర్గ ఇన్‌చార్జులతో కలిసి ఆయన విలేకరులతో మాట్లాడారు. తన కుమారుడు రాఘవరెడ్డితో కలిసి తాను పార్టీ అధినేత చంద్రబాబు సమక్షంలో టీడీపీలో చేరుతున్నట్లు ప్రకటించారు.

SUPER HIT నేడే చూడండి



శాంతి 70 ఎంఎం - నారాయణగూడ 11.00,2.00

లక్ష్మీకళ సినీప్రైడ్ - మూసాపేట్ 11.15am

PVR సెంట్రల్‌మాల్ - పంజాగుట్ట 4.15pm | ఏషియన్ సినీస్క్వేర్ - ఉప్పల్ 4.40pm

PVR ఫోరం మాల్ - కూకట్‌పల్లి 4.15pm | జీపీఆర్ మాల్ - కూకట్‌పల్లి 10.45am

ఏషియన్ సినీమార్క్ - ఆర్.సి.పురం 11.00am | జె.పి.సినిమాస్ - చందానగర్ 1.15pm

నేడే చూడండి బుల్లెట్



సంధ్య 70ఎంఎం - ఆర్.టి.సి. క్రాస్ రోడ్స్ 11.00am

Enjoy 4k Laser Projection & Dolby Atmos Sound

PVR ఫోరంమాల్ - కూకట్‌పల్లి 10.15am | ఏషియన్ సినీమార్క్ - ఆర్.సి.పురం 10.40am

PVR సినిమాస్ - ఎర్రమంజిల్ 10.35am | ఏషియన్ సినీస్క్వేర్ - ఉప్పల్ 4.30pm

జీఎస్ఎమ్ - మల్కాజ్‌గిరి 10.55am | లక్ష్మీకళ సినీప్రైడ్ - మూసాపేట్ 11.30am

నెక్లెస్ సత్య - కావాడిగూడ 10.25am | జె.పి.సినిమాస్ - చందానగర్ 1.40pm

ఆర్తి 70ఎంఎం ఎ/సి - సంఘీనగర్ 11.00,2.00,6.00,9.00 | శ్రీనివాస టాకీస్ - నర్సాపూర్ 11.00,2.00,6.00,9.00

SRI LAKSHMI GAYATRI FILMS 9391176659

SUPER HIT నేడే చూడండి



దేవి 70ఎంఎం ఎ/సి - ఆర్.టి.సి.క్రాస్‌రోడ్స్

ENJOY 4K LASER PROJECTION & DOLBY ATMOS SOUND

11.00.2.15.6.00.9.15

మల్లికార్జున 70ఎంఎం - కూకట్‌పల్లి 11.15,2.30,6.15,9.30

మెగా 70ఎంఎం - దిల్‌సుఖ్‌నగర్ 11.15,2.15,6.15,9.15

ఇంద్రనాగేంద్ర - కర్మన్‌ఘాట్ 11.00,2.15,6.00,9.15

వెంకటరమణపద్మావతి 70 ఎ/సి - కాచిగూడ 11.15,2.30

లక్ష్మీకళ సినీప్రైడ - మూసాపేట్ 11.15,2.15,6.15,9.00

టివోలి 70ఎంఎం - సికింద్రాబాద్ 10.50,1.45,7.45

రాఘవేంద్ర - మల్కాజ్‌గిరి 10.15,4.30,10.40

సినిమాస్ - చందానగర్ 10.00,7.15,10.30

తారకరామ 70 - ఇ.సి.ఐ.ఎల్ 11.00,2.00,6.00,9.00

విజయలక్ష్మి - ఎల్.బి.నగర్ 1.45pm | శ్వేత ఎ/సి - కాటేదాన్ 2.15pm

గంగాభవాని విగ్రహ ప్రతిష్ఠ

- నేడు గంపలు, ఎల్లుండి బోనాలు
- హాజరైన ప్రభుత్వవిప్ రామచంద్రునాయక్, మాజీ ఎంపీ సురేందర్‌రెడ్డి


గంగాభవాని అమ్మవారిని దర్శించున్న ప్రభుత్వ విప్‌రామచంద్రునాయక్

మరిపెడ రూరల్, మార్చి 11 : మండలంలోని పురుషోత్తామాయగూడెం శివారు ఆకేరు వాగు ఒడ్డున గంగాభవాని దేవాలయాన్ని బీఆర్ఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నూకల నరేష్‌రెడ్డి తన సొంత ఖర్చులతో నిర్మించారని, ఈ ప్రాంతంలో ఆధ్యాత్మికత వెలువడిందని ప్రభుత్వ విప్, డోర్నకల్ ఎమ్మెల్యే జాటోతు రామచంద్రునాయక్, వరంగల్ మాజీ ఎంపీ ఆర్.సురేందర్‌రెడ్డి అన్నారు. గంగాభవాని విగ్రహప్రతిష్ఠ సందర్భంగా సోమవారం వేదపండితుల మంత్రోచ్చరణలతో హోమం, విగ్రహప్రతిష్ఠ, పూర్ణాహుతి కార్యక్రమాలను నరేష్‌రెడ్డి తనయుడు తాజామాజీ సర్పంచ్ అభినవ్‌రెడ్డి దంపతులు నిర్వహించారు. అనంతరం వచ్చిన భక్తులకు భోజనాలు ఏర్పాటు చేశారు. నేడు గంగాభవాని వద్దకు గంపలు తీసుకెళ్లడం, ఎల్లుండి బోనాల పండుగను నిర్వహిస్తారు. బోనాల పండుగ నేపథ్యంలో ఇద్దరు మంత్రులు, ముగ్గురు ఎమ్మెల్యేలు రానున్నట్లు తెలిసింది. జిల్లా కాంగ్రెస్ నాయకుడు వంటికొమ్ము యుగేంధర్‌రెడ్డి, మండల అధ్యక్షుడు రఘువీరారెడ్డి, గంధసిరి అంబరీష, జిల్లా ప్రధాన కార్యదర్శి గుగులోతు రవి, మరిపెడ టౌన్ అధ్యక్షుడు తాజుద్దీన్, తగరు శ్రీను, బీఆర్ఎస్ నాయకులు పానుగోతు రాంలాల్, మెంచు అశోక్‌కుమార్, కొంపెల్లి శ్రీనివాసరెడ్డి, కుడితి మహేందర్‌రెడ్డి పాల్గొన్నారు.

డబుల్ బెడ్‌రూం కాలనీ సమస్యలను పరిష్కరించాలి

- మునిసిపల్ కమిషనర్‌కు కాలనీవాసుల వినతి

మహబూబాబాద్ టౌన్, మార్చి 11 : రాంచంద్రాపురం కాలనీ సమీపంలో డబుల్‌బెడ్‌రూం కాలనీల్లో సమస్యలు పరిష్కరించాలని స్థానికులు విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు మహబూబాబాద్ మునిసిపల్ కార్యాలయంలో కమిషనర్ రవీందర్‌కు సోమవారం వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా కాలనీవాసులు మాట్లాడుతూ డబుల్‌బెడ్‌రూం ఇండ్లకు మిషన్ భగీరథపైపులైన్ ద్వారానే నీరు వస్తుందని, గత రెండ్రోజులుగా తాగునీరు రాకపోవడంతో అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని వాపోయారు. రానున్న వేసవి దృష్ట్యా ముందస్తు చర్యల్లో భాగంగా కాలనీల్లో మూడుచోట్ల చేతి పంపులు ఏర్పాటు చేయించాలని విజ్ఞప్తి చేశారు. డబుల్ బెడ్‌రూం ఇండ్లలో లబ్ధిదారులు దాదాపు ఏడాది కాలంగా నివాసముంటున్నారని ఇప్పటి వరకు కాలనీలో సరైన రోడ్డు లేకపోవడంతో వర్షం వస్తే బురదమయంగా మారుతోందని అన్నారు. వీధిలైట్లు లేకపోవడంతో చీకటి మయంగామారి రాత్రి వేళల్లో భయంగా ఉంటున్నారని చెప్పారు. సానుకూలంగా స్పందించిన కమిషనర్ సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చినట్లు చెప్పారు. కాలనీవాసులు బూర్ల ఉపేందర్, శ్రీధర్, బొమ్మర సంపత్, జి.వెంకన్న, సుమతి, పులి శ్రావణి, శంకర్, సునీత పాల్గొన్నారు.

పురుగుల మందుతాగి వ్యక్తి ఆత్మహత్య


తేజావత్ మల్సూర్ (ఫైల్)

సీరోలు, మార్చి11 : కుటుంబ కలహాలతో పురుగుల మందుతాగి వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న సంఘటన రేకులతండాలో సోమవారం రాత్రి చోటు చేసుకుంది. సీరోలు ఎస్సై విజయ్‌రాంకుమార్ తెలిపిన వివరాల ప్రకారం. రేకులతండాకు చెందిన తేజావత్ మల్సూర్ (30) సోమవారం కాంపల్లి వద్ద పురుగుల మందుతాగి స్నేహితుడికి తాను పురుగుల మందుతాగానని చెప్పగా, అతను కుటుంబసభ్యులకు విషయాన్ని తెలియజేశాడని తెలిపారు. మల్సూర్‌ను వెంటనే ఓ ప్రైవేటు వాహనంలో జిల్లా ఆస్పత్రికి తరలించి చికిత్స అందిస్తుండగా మృతి చెందినట్లు ఎస్సై తెలిపారు. మల్సూర్ తన కూతురుకు గౌన్ కొనగా మల్సూర్ తల్లి బిక్కి డబ్బులు ఎందుకు ఖర్చు పెడుతున్నారని అనడంతో భార్య స్వాతి తన కూతురుకు గౌన్ కొనేస్వేచ్ఛ మాకు లేదాఅనే కోపంతో పుట్టింటికి వెళ్లిందని తెలిపారు. దీంతో మనస్థాపానికి గురైన మల్సూర్ పురుగుల మందుతాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడని తెలిపారు. మృతుడి తండ్రి కిషన్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై విజయ్‌రాంకుమార్ తెలిపారు. మృతుడికి భార్య స్వాతి, కుమారుడు, కుమార్తె ఉన్నారు.

'ఇళ్ల స్థలాలు కేటాయించాలి'

నెల్లికుదురు, మార్చి 11 : అర్హులైన లబ్ధిదారులకు ఇండ్ల స్థలాలు కేటాయించాలని రామన్నగూడెం గ్రామస్థులు మైస రాములు, బండి సోమయ్య, ఆది కొమురయ్య ప్రభుత్వాన్ని కోరారు. రామన్నగూడెంలో సోమవారం వారు మాట్లాడారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి లబ్ధిదారులకు స్థలం కేటాయించి ఇందిరమ్మ ఇండ్లు ఇవ్వాలన్నారు. మల్యాల సోమయ్య, మొగులగాని నర్సయ్య, వెంకన్న, శ్రీను, మైస అంజయ్య, చంద్రయ్య, అశోక్, యాకయ్య పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

గూడూరు, మార్చి 11 : అయోధ్యపురం సబ్‌స్టేషన్ పరిధిలోని గుండెంగ, గాజులగట్టు, మదనాపురం, పొనుగోడుతో పాటు పలు గ్రామాల్లో నేడు మంగళవారం విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడనున్నట్లు ఏఈ అమ్మలు తెలిపారు. అయోధ్యపురం సబ్‌స్టేషన్ పరిధిలోని విద్యుత్ స్తంభాల మరమ్మతు పనులు జరుగుతున్న నేపథ్యంలో ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం ఉంటుందని చెప్పారు. ఇందుకు విద్యుత్ వినియోగదారులు సహకరించాలని విజ్ఞప్తి చేశారు.

జీపీ సిబ్బంది వేతనాలు ఇవ్వాలి

- ప్రగతిశీల జీపీ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు రవి


డీపీవో హరిప్రసాద్‌కు వినతి పత్రాన్ని అందిస్తున్న ఇఫ్టూ నేతలు

మహబూబాబాద్ టౌన్, మార్చి 11 : గ్రామ పంచాయతీల్లో పనిచేసే సిబ్బంది వేతనాలను తక్షణమే ఇవ్వాలని ఇఫ్టూ అనుబంధ తెలంగాణ గ్రామ పంచాయతీ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు కొత్తపల్లి రవి డిమాండ్ చేశారు. ఈ మేరకు మహబూబాబాద్‌లో జిల్లా పంచాయతీ అధికారి హరిప్రసాద్‌కు సోమవారం వినతిపత్రాన్ని అందించారు. ఈ సందర్భంగా రవి మాట్లాడుతూ ఒకటవ తారీఖు వేతనాలు ఇస్తామని గొప్పలు చెబుతున్న రాష్ట్ర సర్కార్ గత తొమ్మిది నెలలుగా వేతనాలు రాని జీపీ సిబ్బంది కష్టాలు కన్పించడం లేదా అని ప్రశ్నించారు. కార్యక్రమంలో బిల్లకంటి సూర్యం, బీకు, మల్లేష్, సోమనర్సయ్య, రవి, యాకయ్య, భిక్షం, లక్ష్మి, రాము, యాకూబ్ పాల్గొన్నారు.

కాంగ్రెస్‌కు ఓటేసి, వృథా చేసుకోవద్దు : బీఆర్ఎస్

కురవి, మార్చి 11 : పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీకి ఓటువేసి, వృథా చేసుకోవద్దని ఎంపీ మాలోతు కవిత కోరారు. కురవిలో సోమవారం తోట లాలయ్య అధ్యక్షతన జరిగిన బీఆర్ఎస్ ముఖ్యకార్యకర్తల సమావేశంలో ముఖ్య అతిథిగా పాల్గొని, ఆమె మాట్లాడారు. గత ఎన్నికల్లో కాంగ్రెస్ ఇచ్చిన ఆరు గ్యారెంటీలు సహా 420 హామీలు అమలు చేసేంత వరకు బీఆర్ఎస్ ఆధ్వర్యంలో ప్రజలపక్షాన పోరాడుతామన్నారు. రూ.2 లక్షల రుణమాఫీ, రైతుబంధు సహా రూ.4 వేల పింఛన్ వంటి హామీలను కాంగ్రెస్‌ప్రభుత్వం అమలు చేయడం లేదన్నారు. మాజీమంత్రి, ఎమ్మెల్సీ సత్యవతిరాథోడ్ మాట్లాడుతూ కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన వందరోజుల్లోనే బీఆర్ఎస్ పాలనకు, కాంగ్రెస్ పాలనకు ప్రజలకు తేడా తెలిసిందన్నారు. డోర్నకల్ మాజీ ఎమ్మెల్యే రెడ్యానాయక్ మాట్లాడుతూ ఎంపీగా కవితను గెలిపించాలని కోరారు. బజ్జూరి పిచ్చిరెడ్డి, దొడ్డ గోవర్ధన్‌రెడ్డి, కుడితి మహేందర్‌రెడ్డి, ఎంపీపీ గుగులోతు పద్మావతి, గుగులోతు రవినాయక్, పెద్ది వెంకన్న, గుడిబోయిన రాంచంద్రయ్య, తోట రమేష్, నూతక్కి నర్సింహారావు, అడిదెల దేవేందర్, గుండెబోయిన సూరయ్య పాల్గొన్నారు.

ఎన్నికల హామీలను నెరవేర్చని కాంగ్రెస్ ప్రభుత్వం

- బీఆర్ఎస్ రాష్ట్ర నేత బీరవెల్లి భరత్‌కుమార్‌రెడ్డి


సమావేశంలో మాట్లాడుతున్న భరత్‌కుమార్‌రెడ్డి

గూడూరు, మార్చి 11 : ఎన్నికలకు ముందు కాంగ్రెస్ పార్టీ ప్రజలకు ఇచ్చిన హామీలను నేరవేర్చకుండ ఉద్దెర సబ్సిడీలున్న హామీలను మాత్రం సీఎం రేవంత్‌రెడ్డి అమలు చేస్తున్నారని బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు బీరవెల్లి భరత్‌కుమార్‌రెడ్డి విమర్శించారు. గూడూరు మండల కేంద్రంలో సోమవారం ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి వంద రోజులు దాటినప్పటికి ప్రజలకు ఇచ్చి హామీలను అమలు చేయలేదన్నారు. ఆరు గ్యారెంటీలను 90 రోజుల్లోనే అమలు చేస్తామని ప్రకటించిన సీఎం రేవంత్‌రెడ్డి ఇప్పటి వరకు అమలు చేకపోవడం ఏమిటని ప్రశ్నించారు. కార్యకర్తల్లో ఉత్సాహం నింపేందుకు ఈనెల 13న బీఆర్ఎస్ కార్యకర్తల సమ్మేళనం నిర్వహిస్తున్నట్లు చెప్పారు. గ్రామాల నుంచి ముఖ్యనాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో హాజరు కావాలని కోరారు. బీఆర్ఎస్ మండల అధ్యక్షులు వేం వెంకటకృష్ణారెడ్డి, అధికార ప్రతినిధి బానోత్ నర్సింహానాయక్, యశ్‌పాల్‌రెడ్డి, నాయకులు సంపత్‌రావు, బోడ కిషన్, సోమునాయక్, నూకల సురేందర్, వేణుమాధవ్, రహీం, వెంకన్న, కటార్‌సింగ్, కుమార్ పాల్గొన్నారు.

బీజేపీకి మండల అధ్యక్షుడు రాజీనామా



చిన్నగూడూరు, మార్చి11 : బీజేపీ చిన్నగూడూరు మండల అధ్యక్షుడు బోయిని యాకన్న ముదిరాజ్ ఆ పార్టీకి సోమవారం రాజీనామా చేశారు. ఈ సందర్భంగా ఆయన విలేకరులతో మాట్లాడారు. ఈటల రాజేందర్ అభిమానిగా పార్టీలో చేరానని, మారు తున్న రాజకీయ పరిస్థితుల వల్ల బీజేపీకి రాజీనామా చేశానని తెలిపారు. తన రాజీనామా ను జిల్లా అధ్యక్షుడు వెంకటేశ్వరరావు పంపినట్లు తెలిపారు. పార్టీలో కొనసాగినంతవరకు సహకరించిన నాయకులకు కార్యకర్తలకు కృతజ్ఞతలు తెలిపారు. త్వరలో తన భవిష్యత్ కార్యాచరణను తెలుపుతామన్నారు.

ఢిల్లీ సాహిత్య ఉత్సవంలో యాకమ్మ



కవితను వినిపిస్తున్న కవయిత్రి యాకమ్మ

మహబూబాబాద్ ఎడ్యుకేషన్, మార్చి 11 : పట్టణానికి చెందిన కవయిత్రి, రచయిత్రి, ప్రభుత్వ ఉపాధ్యాయురాలు యాకమ్మ ఢిల్లీలో సోమవారం నిర్వహించిన సాహిత్య ఉత్సవంలో తన కవితను వినిపించారు. ఢిల్లీలో కేంద్ర సాహిత్య అకాడమీ ఆధ్వర్యంలో ఈనెల 11 నుంచి 16 వరకు జరిగే ప్రతిష్టాత్మక ఫెస్టివల్ ఆఫ్ లెటర్స్ జాతీయ ఉత్సవంలో పాల్గొని తొలిపొద్దు, వెన్నెల గొడుగు, మౌన రాగం కవితలను తెలుగు, ఇంగ్లీష్‌లలో వినిపించారు. ఈ ఉత్సవంలో 170భాషల నుంచి 1110 మంది సాహితీ కారులు పాల్గొని కవితలను వినిపించారు. అనంతరం ఉత్సవంలో పాల్గొని కవితలను వినిపించిన యాకమ్మను ప్రముఖ కవులు గుల్జార్, బద్రినారాయణ, అరుంధతి, సుబ్రమణియం, భైరప్ప, ఇనాక్ ఘనంగా సన్మానించారు.

క్రీడల్లో రాణిస్తే ఉజ్వల భవిష్యత్ : ఎస్సై


కబడ్డీ విజేత నూతనకల్ జట్టు క్యాప్టెన్‌కు నగదు ప్రోత్సాహం అందజేస్తున్న ఎస్సై సతీష్, దాత వెంకట్రాంనర్సయ్య

నర్సింహులపేట, మార్చి 11 : యువత క్రీడల్లో రాణిస్తే ఉజ్వల భవిష్యత్ ఉంటుందని నర్సింహులపేట ఎస్సై గండ్రాతి సతీష్ అన్నారు. నర్సింహులపేటలో రాజీవ్ యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఉమ్మడి వరంగల్, ఖమ్మం, నల్లగొండ జిల్లా స్థాయి కబడ్డీ పోటీల్లో విజేతలకు సోమవారం బహుమతులు, నగదు ప్రోత్సాహకాలను అందజేశారు. సూర్యాపేట జిల్లా నూతనకల్ జట్టు విజేతగా నిలిచి రూ. 40 వేలు నగదు, ట్రోఫీ కైవసం చేసుకుంది. ద్వితీయ స్థానంలో సూర్యాపేట జిల్లా మద్దిరాల ఎర్రబాడు రూ. 30 వేల నగదు ట్రోఫీ, తృతీయ విజేతగా భూపాలపల్లి జటు రూ. 20వేలు నగదు ట్రోఫీ, నాలుగు, ఐదో స్థానంలో గిరిమిల్ల రూ.15 వేలు, ట్రోఫీ, ఆలేరు జట్టు నిలిచింది. రూ. 8 వేలు నగదు ప్రోత్సహంతో పాటు ట్రోఫీ ప్రదానం చేశారు. ఈ సందర్భంగా క్రీడాకారులను అభినందించారు. క్రీడల నిర్వహణ కమిటీ అధ్యక్షుడు దోమల యాదగిరి, రేఖ అనిల్, పొన్నం శ్రీకాంత్, కాస యాకన్న, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు జినుకల రమేష్, ఎస్టీ సెల్ అధ్యక్షుడు బానోత్ దస్రూనాయక్, జిల్లా ఉపాధ్యక్షుడు ఇర్రి లింగారెడ్డి పాల్గొన్నారు.

'ఏజెన్సీలో ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించాలి'



వినతి పత్రం ఇస్తున్న టీఎస్ ఏటీఎఫ్ నాయకులు

కొత్తగూడ, మార్చి 11 : ఏజెన్సీలో పనిచేస్తున్న ఉపాధ్యాయుల సమస్యలు, విద్యారంగ సమస్యలను పరిష్కరించాలని, డీఎస్సీ 2024 ప్రకటించి ఏజెన్సీలో జీవో నెం 3ప్రకారం ఆదివాసీ, గిరిజన అభ్యర్థులతో భర్తీ చేయాలని టీఎస్ ఏటీఎఫ్ నాయకులు డిమాండ్ చేశారు. ఈమేరకు హైదరాబాద్‌లో ట్రైబల్ వెల్ఫేర్ కమిషనర్‌కు సోమవారం వినతి ప్రతం ఇచ్చారు. కార్యక్రమంలో టీఎస్ ఏటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు మోకాళ్ల శ్రీనివాసరావు, ప్రధాన కార్యదర్శి కబ్బాకుల రవి, ఉపాధ్యాయులు పీర్ల కృష్ణ, ప్రచార కార్యదర్శి కురుసం అంజయ్య, కోశాధికారి నాగేంద్రప్రసాద్, రాష్ట్ర కార్యదర్శి కుంజ కృష్ణ, వర్కింగ్ ప్రెసిడెంట్ లింగయ్య, మహబూబాబాద్, బద్రాద్రి కొత్తగూడెం జిల్లాల అధ్యక్షుడు సిద్ధబోయిన భిక్షం, ఆనందరావు, నాయకులు పాల్గొన్నారు.

ఎంపీని కలిసిన పద్మశాలి సంఘం బాధ్యులు


ఎంపీ రవిచంద్రను కలిసిన పద్మశాలి సంఘం బాధ్యులు

కేసముద్రం, మార్చి 11 : రాజ్యసభకు రెండోసారి ఎన్నికైన సందర్భంగా ఎంపీ వద్దిరాజు రవిచంద్రను హైదరాబాద్‌లో సోమవారం కేసముద్రం మండల పద్మశాలి సంఘం నాయకులు కలిసి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో సంఘం నాయకులు సామల నర్సయ్య, దాసరి శ్రీనివాస్, సామల రమేష్, మామిడాల శ్రీనివాస్, చిట్యాల వీరన్న, రుద్ర శ్రీకాంత్, మిడతనపల్లి ప్రకాశ్, అందె సాంబయ్య, చెల్లమల్ల కిరణ్, బొద్దుల సతీష్ పాల్గొన్నారు.


సీఎం, పొంగులేటి చిత్రపటాలకు క్షీరాభిషేకం చేస్తున్న కాంగ్రెస్ నాయకులు

సీఎం చిత్రపటానికి క్షీరాభిషేకం

చిన్నగూడూరు, మార్చి 11 : మండలకేంద్రంలోని ఉగ్గంపల్లిలో సోమవారం కాంగ్రెస్ పార్టీ గ్యారెంటీలో ఒకటైన ఇందిరమ్మ ఇల్లు పథకాన్ని ప్రారంభించిన సందర్భంగా సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, డోర్నకల్ ఎమ్మెల్యే రాంచంద్రునాయక్ చిత్ర పటాలకు క్షీరాభిషేకం చేశారు. అనంతరం కాంగ్రెస్ కార్యకర్తలు సంబరాలు చేసుకున్నారు. కార్యక్రమంలో గ్రామపార్టీ అధ్యక్షుడు గండ్లె భద్రయ్య, ఇందిరమ్మ అధ్యక్షుడు డీఎస్ వెంకట్య, ఉపాధ్యక్షులు భర్తపురం యాకన్న, డీఎస్.మేగ్యా నాయకులు దాసరి రాజు, సేవాలాల్ కమిటీ అధ్యక్షుడు అంగోతు జగన్, యూత్ అధ్యక్షుడు యాకన్న, రవి, రాంమూర్తి, ప్రధానకార్యదర్శి శ్రీపాల్, లక్‌పతి, మోతీలాల్, బాలు అనిల్, శ్రావణ్ ఉన్నారు.

'బీఆర్ఎస్ నాయకులు కాంగ్రెస్‌కు అవసరం లేదు'

నర్సింహులపేట, మార్చి 11 : ప్రజలు తిరస్కరించిన బీఆర్ఎస్ నాయకులు కాంగ్రెస్‌కు అవసరం లేదని నర్సింహులపేట కాంగ్రెస్ మండల అధ్యక్షుడు జినుకల రమేష్ అన్నారు. మండల కేంద్రంలో పార్టీ ముఖ్యకార్యకర్తల సమావేశంలో సోమవారం ఆయన మాట్లాడారు. అవినీతి ఆరోపణలతో ప్రజలు తిరస్కరిస్తే అలాంటి నాయకులను కాంగ్రెస్ పార్టీలోకి తీసుకోవడం ఏమిటని అధిష్టానాన్ని ప్రశ్నించారు. చేరికలపై ఎలాంటి నిర్ణయం తీసుకున్నా పార్టీ క్యాడర్‌కు సమాచారం అందించి నిర్ణయం తీసుకోవాలన్నారు. ఎన్నికల సమయంలో గెలుపు కోసం కష్టపడిన ప్రతీ కార్యకర్తకు గుర్తింపు ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి సోమిరెడ్డి, బ్లాక్ కాంగ్రెస్ నాయకులు దాసరోజు రాజశేఖర్, మైనారిటీ సెల్ నాయకులు ఎస్‌కే రఫీ, గుగులోతు రవీందర్, జయపాల్‌రెడ్డి , అన్ని గ్రామాల అధ్యక్షుడు, ముఖ్య నాయకులు పాల్గొన్నారు.

విద్యార్థులకు పరీక్ష ప్యాడ్‌ల పంపిణీ


తొర్రూరు రూరల్, మార్చి11 : గుర్తూర్ ఉన్నత పాఠశాలలో చదువుతున్న పేద విద్యార్థులకు మృత్యుం జయరాజ్ ఫౌండేషన్ వారి సహకారంతో స్టడీ మెటీరియల్, పరీక్ష ప్యాడ్లను అందజేశారు. ఈ సందర్భంగా పాఠశాల హెచ్‌ఎం భాస్కరా చారి మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలో చదువుతున్న విద్యార్థులకు చేయూతనిస్తూ అండగా ఉండేవిధంగా దాతలు ముందుకు రావడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో ఫౌండేషన్ నిర్వాకులు మేడే సాయికిరణ్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

- నర్సింహులపేట : మండలంలోని కస్తూర్బాగాంధీ బాలికల విద్యాలయంలో పదో తరగతి విద్యనభ్యసిస్తున్న 25 మంది బాలికలకు నర్సింహులపేటకు చెందిన ఎనగండ్ల కృష్ణారెడ్డి రూ. 5వేల విలువైన పరీక్షా సామగ్రిని సోమవారం ఉచితంగా అందజేశారు.ఈ సందర్భంగా పాఠశాల ఎస్‌వో స్వప్న మాట్లాడుతూ పేద విద్యార్థుల పట్ల క్రిష్ణారెడ్డి అందించిన సహకారం అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో బండి రమేష్, ఉపాధ్యాయ బృందం ఉన్నారు.

కాంగ్రెస్ బూత్ కన్వీనర్ మృతి

తొర్రూరు రూరల్, మార్చి 11 : చింతలపల్లి గ్రామ కాంగ్రెస్ పార్టీ బూత్ కన్వీనర్ బోలగాని మహేష్‌గత కొన్ని రోజులుగా అనారోగ్యంతో బాధపడుతూ సోమవారం మృతి చెందాడు. మహేష్ కుటుంబాన్ని మండల పార్టీ అధ్యక్షుడు సుంచు సంతోష్, వర్కింగ్ ప్రెసిడెంట్ మేల కుమార్ పరామర్శించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పార్టీకి అన్ని విధాలుగా అండా ఉండి పార్టీకో అనునిత్యం పాటుపడిన వ్యక్తి మహేష్ మృతి పార్టీకి తీరని లోటన్నారు. ఈ కార్యక్రమంలో కిసాన్‌సెల్ జిల్లా అధ్యక్షుడు కందాడి అశోక్ రెడ్డి, పెదగాని సోమయ్య, మాజీ సర్పంచ్ కాట మల్లారెడ్డి, బీసీసెల్ మండల అధ్యక్షుడు ధీకొండ మధు, గ్రామపార్టీ అధ్యక్షుడు వడ్లకొండ కుమార్, వీరస్వామి, ఎడ్ల వెంకట్ రెడ్డి పాల్గొన్నారు.

గుండెపోటుతో తెలంగాణ ఉద్యమకారుడు మృతి


బయ్యపోతుల సోమయ్య (ఫైల్)

కురవి, మార్చి 11 : స్టేషన్ గుండ్రాతిమడుగు గ్రామానికి చెందిన తెలంగాణ ఉద్యమకారుడు బయ్యపోతుల సోమయ్య (53) గుండెపోటుతో సోమవారం మృతి చెందాడు. మలిదశ తెలంగాణ ఉద్యమంలో సోమయ్య క్రియాశీలకంగా పనిచేశారు. సీపీఐ అనుబంధ ప్రజానాట్యమండలి రాష్ట్రస్థాయి కళాకారుడిగా పని చేసిన బయ్య సోమయ్య అనంతరం తెలంగాణ ఉద్యమంలో పాల్గొని బీఆర్ఎస్ నాయకుడిగా పని చేశారు. సోమయ్య మృతదేహానికి మహబూబాబాద్ ఎంపీ మాలోతు కవిత, సీపీఐ జిల్లా కార్యదర్శి బి.విజయసారథి, సహాయ కార్యదర్శి నల్లు సుధాకర‌రెడ్డి, కట్టబోయిన శ్రీనివాస్, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు తోట లాలయ్య, గుగులోతు రవి, మారగాని వీరభద్రం, పోతుల రామ్మూర్తి, కామ సంజీవరావు, బండి యతిరాజ్, పోలెపాక వెంకన్న నివాళ్లర్పించారు.

చట్టాలపై అవగాహన కలిగి ఉండాలి

- కొత్తగూడ ఎస్సై దిలీప్


కొత్తగూడలో విద్యార్థులతో దిలీప్

కొత్తగూడ, మార్చి 11 : చట్టాలపై అవగాహన లేకపోవడంతో నేరచరిత్ర పెరిగిపోతుందని, విద్యార్థులు చట్టాలపై అవగాహన కలిగిఉండాలని ఎస్సై దిలీప్ సూచించారు. దొరవారివేంపల్లిలోని ప్రాథమిక పాఠశాల విద్యార్థులు సోమవారం ఫీల్డ్‌ట్రిప్ నిర్వహించుకున్నారు. అందులో భాగంగా పోలీస్‌స్టేషన్‌లో పోలీస్‌ల విధులపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఉపాధ్యాయుడు కృష్ణ ఉన్నారు.

సీసీ రోడ్డు ధ్వంసం చేశారంటూ ఫిర్యాదు

డోర్నకల్, మార్చి11 : గుర్రాలకుంట గ్రామపంచాయతీ శివారు టేకులతండాలో నూతనంగా నిర్మిస్తున్న సీసీ రోడ్డును తండాకు చెందిన కొందరు వ్యక్తులు ఉద్దేశపూర్వకంగానే ధ్వంసం చేశారని కాంగ్రెస్ మాలోతు భావ్‌సింగ్ ఆరోపించారు. ఈ మేరకు పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు పేర్కొన్నారు. ఈ సందర్భంగా భావ్‌సింగ్ మాట్లాడుతూ జాతీయ ఉపాధిహామీ పథకంలో భాగంగా రూ. 8లక్షలతో తండాలో సీసీరోడ్డు నిర్మాణ పనులు చేపట్టినట్లు చెప్పారు. ఆదివారం రాత్రి వేసిన సిమెంట్‌రోడ్డుపై కొందరు ఉద్దేశపూర్వకంగా గుంతలు పెట్టారని అన్నారు. నిందితులను గుర్తించి వారిపై చర్యలు తీసుకోవాలని పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు భావ్‌సింగ్ తెలిపారు.

కుష్టు వ్యాధిగ్రస్తులకు ఉచిత మందుల పంపిణీ

తొర్రూరు, మార్చి 11 : శరీరంపై గోధుమ రంగు, ఎరుపు, రాగి వర్ణం కలిగిన మొద్దుబారిన స్పర్శలేని మచ్చలు వస్తే వారిని కుష్టు వ్యాధి గ్రస్తులుగా గుర్తించవచ్చని డివిజన్ డిప్యూటీ పారామెడికల్ అధికారి వనాకర్ రెడ్డి అన్నారు. డివిజన్ కేంద్రంలో పాటు డివిజన్ పరిధిలోని అన్ని గ్రామాల్లో సోమవారం ఇంటింటా సర్వే చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డివిజన్‌లో 77వేల కుటుంబాలు ఉండగా 270 మంది సిబ్బంది బృందాలుగా ఏర్పడి సర్వే చేస్తున్నారని తెలిపారు. వ్యాధి లక్షణాలు ఉన్నవారువెంటనే దగ్గరలో ఉన్న ప్రభుత్వ ఆస్పత్రిలో సంప్రదించాలని తెలిపారు. ప్రాథమిక దశలోనే వ్యాధిని గుర్తించి మందులు వాడితే వందశాతం నివారించవచ్చన్నారు. వ్యాధి సోకిన 3 నుంచి 8 ఏళ్ల తర్వాత లక్షణాలు కనపడతాయని, చికిత్స అందకపోతే అంగవైకల్యం ఏర్పడుతుందని, వెంటనే చికిత్స పొందాలని తెలిపారు. వీరికి ప్రభుత్వం సంవత్సరం పాటు ఉచితంగా మందులు అందజేస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో సీహెచ్‌వో విజయ్‌కుమార్, వైద్య సిబ్బంది తదితరులు ఉన్నారు.

రోగులకు మెరుగైన వైద్యసేవలు అందించాలి


ఏఐకేఎంఎస్ జిల్లా కార్యదర్శి సక్రు


ముల్కనూరు పీహెచ్‌సీ ఆస్పత్రిలో వైద్య అందక పోవడంతో ఇబ్బందులు పడుతున్న రోగులు

గార్ల, మార్చి 11 : చిన్నకిష్టాపురం పెద్దకిష్టాపురం పంచాయతీల్లోని దేశ్యా తండా, సర్పన్‌తండా, ఎస్సీ కాలనీ వైరల్ విష జ్వరాలతో బాధపడుతూ ముల్కనూరు పీహెచ్‌సీ ఆస్పత్రిలో చేరిన రోగులకు వైద్య సిబ్బంది మేరుగైన వైద్య సేవలు అందించాలని ఏఐకేఎంఎస్ జిల్లా కార్యదర్శి జి.సక్రు అన్నారు. సోమవారంముల్కనూరు పీహెచ్‌సీ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న రోగులను ఆయన పరామర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో పనిచేసే వైద్యసిబ్బంది రోగులను ఏమాత్రం పట్టించుకోవడం లేదని, దీంతో గ్రామాల్లో జ్వరాలువిజృంబిస్తున్నాయన్నారు. జిల్లా అధికారులు పర్యేక్షణ జరిపి అంటువ్యాధుల నివారణ చర్యలు తీసుకోవాలన్నారు.

'మున్నేరుకు నీటిని వదలాలి'

డోర్నకల్, మార్చి 11 : మండలంలోని మున్నేరు ఒడ్డున రైతులు సాగు చేసిన వరిపంటలు నీరు లేక ఎండిపోతున్నాయని వెంటనే మున్నేరుకు నీటి వదలాలని కాంగ్రెస్ నాయకులు, ఉయ్యాలవాడ మాజీ సర్పంచ్ తాళ్లూరి రామయ్య ప్రభుత్వాన్ని కోరారు. ఈ సందర్భంగా రామయ్య మాట్లాడుతూ మండలంలోని ఉమ్మడి గొల్లచర్ల గ్రామపంచాయతీ, ఉయ్యాలవాడ, చాంప్లా తండ, అమ్మపాలెం, వెన్నారం, తహసీల్దార్ బంజర గ్రామపంచాయతీల పరిధిలో సుమారు 1500 ఎకరాల్లో రైతులు వరిపంటను సాగు చేశారని, అవి ప్రస్తుతం పొట్టదశలో ఉన్నాయని చెప్పారు. మున్నేరులో నీరు అడుగంటిపోవడంతో వాటికి నీరు లేక ఎండిపోయే ప్రమాదమున్నందున వెంటనే నీటిపారుదల శాఖ అధికారులు ఎస్సారెస్పీ కాలువల ద్వారా మున్నేరుకు నీటిని వదలాలని విజ్ఞప్తి చేశారు.



WANTED
★ Wanted Female Front Office Coordinater Receptionist with Computer knowledge minimum experience of 1 year. GNM (or) B.Sc. Nursing Female Staff Nurse required. Cell : 9305444555, 9381619355
AJW-159760

కావలెను
★ A to Z బజార్ నందు సెక్యూరిటీగా పనిచేయుటకు అమ్మాయిలు, అబ్బాయిలు కావలెను. సంప్ర॥ A to Z Bazar, అదాలత్ సర్కిల్, HNK. Cell : 9059040017
AJW-14208

WANTED DRIVERS
★ భవాని ఖార గొర్రెకుంటలో పనిచేయడానికి DCM & బొలెరో డ్రైవర్స్ కావలెను. Phone Call Timings 11 am to 6 pm. Cell : 9396991649
AJW-5853

WANTED HOSPITAL STAFF
★ GNM నర్సులు, మెడికల్ షాప్ సేల్స్‌మెన్స్ మరియు LAB టెక్నీషియన్స్ అనుభవంగలవారు కావలెను. సంప్ర॥ గార్డియన్ హాస్పిటల్, ములుగు "X" రోడ్, వరంగల్. 12 to 2 pm.
AJW-0361

WANTED
★ హనుమకొండలో మా సంస్థ నందు పనిచేయుటకు 3 వీలర్ బ్యాచ్ కలిగిన డ్రైవర్ + సప్లై బాయ్ కావలెను. సంప్ర॥ 9666717040, 9390562110
AJW-14210

WANTED HELPERS
★ భవాని ఖార గొర్రెకుంటలో పనిచేయడానికి హెల్పర్స్ కావలెను. Salary : 14,000/-. Phone Call Timings 11 am to 6 pm. Only Boys. Cell : 9396991649
AJW-5854

WANTED
★ ప్రముఖ బ్యూటీ పార్లర్‌లో పనిచేయుటకు అనుభవజ్ఞులైన లేడీవర్కర్ కావలెను. ఉచిత వసతి + రూమ్ + భోజనం కలదు. సెల్ : 9951716914.
AJM-11602

RENTAL FOR SCHOOL BUILDING
★ Station Ghanpur (Mdl), Shivunipally (Vill) లోని Aditya Model School Building Rental కు ఇవ్వబడును. ఆసక్తిగలవారు స్కూల్‌లో సంప్రదించగలరు. Cell : 9391180737, 6374650070, 8555909524
AJW-5852

HOUSE FOR SALE
★ హన్మకొండ, NGO's Colony లో గల 160 చ॥గ॥ల 2 BHK, G+1 ఇల్లు అమ్మబడును. సంప్ర॥ 8074106289, 9491941487
AJW-177986

BUILDING FOR SALE
★ హన్మకొండ రాంనగర్‌లో 300 చ.గ.ల G+2 3ఫ్లోర్ గల కొత్త బిల్డింగ్ EACH FLOOR 2200Sft. తో అమ్మకానికి రెడీగా ఉంది. సం.ప్ర.॥ 9849385402
AJW-5842

HOUSE FOR SALE
★ కేవలం రూ॥ 26 లక్షలకే డబుల్ బెడ్‌రూం హౌస్ విత్ ఫర్నీచర్‌తో వాయిదా పద్ధతిలో (EMI) అమ్మబడును. సంప్ర॥ 9573689941
AJW-159719

PLOTS FOR SALE
★ GWMC & KUDA అప్రూవ్డ్ లేఅవుట్ చింతగట్టు హన్మకొండలో అన్ని అభివృద్ధి పనులతో అమ్మబడును. కేవలం 15,000/-లకు గజం మాత్రమే. సంప్ర॥ 9849992488
AJW-5851

FLAT FOR SALE
★ హన్మకొండ చైతన్యపురి కాలనీ NIT దగ్గర సిద్ధార్థ రెసిడెన్సీ అపార్ట్‌మెంట్‌లో 2nd Floor East Face, 1504 Sft. Flat అమ్మబడును. సంప్ర॥ 9177999950
AJW-177987

ఆపరేషన్ థియేటర్ సామగ్రి అమ్మబడును
★ ప్రముఖ హాస్పిటల్‌లోని ఆపరేషన్ థియేటర్ సామాగ్రి మొత్తం అమ్మబడును. వెంటనే సంప్రదించండి సెల్ : 9959726765
AJW-177975

మినరల్ వాటర్ మిషన్స్ (R.O.)
★ హాస్టల్‌లకు, పరిశ్రమలకు, గ్రామాలకు, కూల్ మిషన్స్, వాటర్ ప్లాంట్ మిషన్స్ (R.O) లభించును. కెమికల్స్, ఫిల్టర్, etc., సంప్ర॥ K.K.ఆక్వా, సెల్ : 7306888555, 8121026555
AJW-1177979

సెక్యూరిటీ గార్డ్స్ కావలెను
★ హన్మకొండ, వరంగల్ లోకల్‌లో పనిచేయుటకు సెక్యూరిటీ గార్డ్స్, సూపర్‌వైజర్స్ అర్జెంటుగా కావలెను. జీతం : 12,000 - 14,000/-. 8 గం॥, 12 గం॥ల డ్యూటీలు కలవు. సంప్ర॥ 8688072125
AJW-177989

కావలెను
★ ఇంట్లో పని చేయడానికి భార్యభర్తలు కావలెను. రూమ్ ఫ్రీ, జీతం (ఇద్దరికి కలిపి) 17,000/-. అడ్రస్ : యాదవనగర్ పెట్రోల్ పంప్, రెడ్డి కాలనీ, హన్మకొండ. సెల్ : 9581501234
AJW-177988

కావలెను
★ ఇన్సూరెన్స్ కంపెనీలో పనిచేసేందుకు గృహిణులు, ప్రైవేట్ ఉద్యోగులు, రిటైర్డ్ ఉద్యోగులు కావలెను. జీతం / కమీషన్. పార్ట్ టైమ్ / వర్క్ ఫ్రమ్ హోం, ఇంటర్ పాసై ఉండాలి. సంప్ర॥ 9063020149
AJW-177990

పాఠకులకు ముఖ్య గమనిక
క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో నిజానిజాలు క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు ప్రకటించిన లేదా ప్రచురించిన క్లెయిమ్‌లతో ఆంధ్రజ్యోతి సంస్థకు ఏ విధమైన సంబంధం లేదు. ప్రకటనలకు సంబంధించి పాఠకులు బ్యాంక్ అకౌంట్ల ద్వారా/ఇతరత్రా నమ్మించబడిన /క్లెయిమ్స్‌కు, చట్ట వ్యతిరేక మోసాలకు ప్రకటనదారునితో జరుపబడు లావాదేవీలకు ఆంధ్రజ్యోతి సంస్థ/యాజమాన్యం ఎటువంటి బాధ్యత వహించదు. పాఠకులు ఈ విషయాన్ని ముఖ్యంగా గమనించగలరు.
మేనేజర్ - ఏడీవీటీ

ప్రతి నాలుగు లైన్ల క్లాసిఫైడ్ ప్రకటనకు రూ. 250/- మాత్రమే. అదనపు లైనుకు రూ. 45/-
గమనిక : మీరు ఇచ్చే ప్రతీ ప్రకటనలకు 5% GST అదనంగా చెల్లించవలెను.